తెలంగాణ జాతీయ దినపత్రిక

# ప్రజా మంటలు

సంపుటి : 4
సంచిక : 26
పేజీలు - 8
వెల- రూ 5 : 00
prajamantalu.com

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

గురువారం 15, జూన్-2023

## పిల్లల ఎదుగుదల సక్రమంగా ఉండాలి



2లో..

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri



# వైద్యరంగం బలోపేతమే మా లక్ష్యం



- కరోనాను మించిన విపత్తు వచ్చినా సిద్ధం
- ఏటేటా వైద్యరంగానికి బడ్జెట్ నిధుల పెంపు
- తెలంగాణలో పెద్ద ఎత్తున ఆస్పత్రుల నిర్మాణం
- నిమ్స్‌లో కొత్త బ్లాక్ నిర్మాణానికి కెసిఆర్ శంకుస్థాపన
- గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ ప్రారంభం

హైదరాబాద్,జూన్14(ప్రజామంటలు) : కరోనా వంటి విపత్కర పరిస్థితులెన్ని ఎదురైనా సమర్థంగా ఎదుర్కొనేలా వైద్యరంగాన్ని బలోపేతం చేస్తున్నామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వైద్య సిబ్బంది పని చేయాలని సూచించారు. నిమ్స్‌లో దశాబ్ది బ్లాక్ నిర్మాణానికి సిఎం కెసిఆర్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కెసిఆర్ మీడియాతో మాట్లాడారు. రెండు వేల పడకలతో నిమ్స్‌లో కొత్త బ్లాక్ నిర్మాణం చేపట్టామన్నారు. రూ.1571 కోట్లతో 32 ఎకరాల విస్తీర్ణంలో కొత్త బ్లాక్ నిర్మాణం జరుగుతోందని కొత్త బ్లాక్ నిర్మాణంతో 38 విభాగాల సేవలు అందుబాటులోకి రానున్నాయని కెసిఆర్ తెలిపారు. రెండో విడత న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కూడా సిఎం కెసిఆర్ ప్రారంభించారు. వైద్యానికి మానవ జీవితానికి ఎడతెగని సంబంధం ఉందని తెలియజేశారు. ఆరుగురు గర్భిణీలకు న్యటీషన్ కిట్స్ అందజేశారు. తెలంగాణ వచ్చాక ఆరోగ్య శాఖ అతికీలకమైందని భావించామన్నారు. హైదరాబాద్‌కు నాలుగు వైపులా నాలుగు ఆస్పత్రులు నిర్మించుకుంటున్నామని, వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణం శరవేగంగా సాగుతోందని కెసిఆర్ తెలిపారు. మానవజాతి ఉన్నంత కాలం వైద్యులు ఉంటారని చెప్పారు. అప్పు ఇచ్చు వాడు ఉండాలి.. వైద్యులు ఉండాలని గతంలో కవులు చెప్పారన్నారు. తెలంగాణ వచ్చాక ఆరోగ్యశాఖ అతికీలకమైనదిగా భావించామని తెలిపారు. 2014లో వైద్యరంగానికి బడ్జెట్‌లో రూ.2001 కోట్లు కేటాయించామని, 2023-24 నాటికి అది రూ.12,367 కోట్లకు చేరిందని వెల్లడించారు. వైద్యరంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. 550 టన్నుల ఆక్సిజన్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకుంటున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో కరోనాను మించిన వైరస్‌లు వస్తాయని నిపుణులు చెప్పారన్నారు. వైద్యరంగం బలంగా ఉన్న చోట తక్కువ నష్టంతో బయటపడుతారని చెప్పారని తెలిపారు. అందుకే వైద్యరంగాన్ని రాష్ట్రంలో బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. మిగతా 2లో..

# కేసిఆర్ స్వప్న సాకారం



### ఆరోగ్య రంగంలో అద్భుత ఫలితం

### సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్

(రామ కిష్టయ్య సంగన భట్ల)



ధర్మపురి జూన్ 14 (పజా మంటలు) : దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన వైద్య ఆరోగ్య రంగంలో నూతన తెలంగాణ రాష్ట్రంలో కేసిఆర్ స్వప్న సాకారం జరిగి అద్భుత ఫలితాలు సాధించిందని రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో గడిచిన 9 ఏండ్లలో కీలకమైన వైద్యారోగ్య శాఖలో సమూల మార్పులు చేపట్టి ఆరోగ్య తెలంగాణ దిశగా సాగుతున్నామని ఈశ్వర్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ధర్మపురిలో ఆరోగ్య దినోత్సవ కార్యక్రమం జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ65 ఏండ్ల పాలనలో గత పాలకులు వైద్యరంగం లో అవలంబించిన విధానాలు, సౌకర్యాల ఏర్పాట్లలో వైఫల్యాలను గుర్తుచేశారు. వరంగల్ ఎంజీఎం, నిమ్స్ , గాంధీ, ఉస్మానియా లాంటి నిజాం కాలం నాటి ఆసుపత్రులు తప్ప కోట్లాది మందికి సరియైన వైద్య సేవలు అందరికి అందించే దిశగా కృషిచేయలేదని అన్నారు. కేసిఆర్ ఆరోగ్య తెలంగాణ కోసం అనేక నిర్ణయాలు తీసుకుని జిల్లాకు ఒక మెడికల్ కళాశాల కేటాయింపు, స్టాఫ్ పెంపు, లాబ్ ల ఏర్పాటు, వేల కోట్లతో హైదరాబాద్ నలుమూలలా 4 అత్యాధునికమైన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలు చేపట్టారని వీటి ద్వారా వేలాది పడకల సౌకర్యం లభిస్తుందన్నారు. ఆశా వర్కర్ల, ఏ ఎన్ ఎం ల గౌరవ వేతనాలు పెంపు, కాంట్రాక్టు ఉద్యోగులకు 30శాతం పీ ఆర్ సి అమలు చేసిన రాష్ట్రం దేశంలో లేదన్నారు. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు దేశంలో ఎక్కడా లేదన్నారు. ఆశా వర్కర్ల సేవలను కీర్తించారు. జగిత్యాల జిల్లా లో అన్ని హంగులతో మెడికల్ కాలేజ్ అందుబాటులో కి రానుందని, ప్రజల్లో అవగాహన రావాలని, ప్రయివేటు లాబ్ లకు వెళ్లకుండా వీటిని వినియోగించు కోవాలని కోరారు. ఇక ధర్మపురి నియోజకవర్గంలో గడిచిన నాలుగున్నర ఏండ్లలో మిగతా 2లో..

## సిరిసిల్ల జిల్లాలో మంత్రి కెటిఆర్ పర్యటన

### వేంకటేశ్వరాలయపునర్నిర్మాణానికి శంకుస్థాపన



రాజన్న సిరిసిల్ల,జూన్14 : రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటించారు. పలు అభివృద్ధి కార్యాక్ర మాల్లో పాల్గొన్నారు. సిరిసిల్ల పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ పునఃనిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్‌తో కలిసి ఆలయన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎల్లారెడ్డి మండలం కేంద్రంలో నిర్మిస్తున్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి భూమిపూజ చేసారు. మధ్యాహ్నం సాయిమణి గార్డెన్‌లో బీఆర్ఎస్ యూత్ నాయకుడు కొర్రీ అనిల్‌కుమార్ వివాహ వేడుకలకు మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. తరవాత యూత్ నాయకుడు సుధాకర్ ఏర్పాటు చేసిన డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ప్రారంభించారు. సిరిసిల్లకు చేరుకుని మున్నూరుకాపు సంఘ కల్యాణమండపంలో టీఆర్ఎస్వీ నేత శ్రీనివాస్ యాదవ్ వివాహ వేడుకలకు హాజరయ్యారు.

# బిఆర్ఎస్ నేతల ఇళ్లపై ఐటి దాడులు

### ఎంపి కొత్త, ఎమ్మెల్యే పైళ్ల ఇళ్లపై దాడులు

### ఏక కాలంలో బృందాలుగా తనిఖీలు

హైదరాబాద్,జూన్14(ప్రజామంటలు) : తెలంగాణలో మరోసారి ఐటీ రైడ్స్ కలకలం రేపుతున్నాయి. బీఆర్ఎస్ నేత, భువనగిరి ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి నివాసం, ఆఫీసుల్లో సోదాలు చేపట్టారు. ఆయనతోపాటు బీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఇంట్లో కూడా ఐటీ సోదాలు చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేల నివాసాల్లో ఐటీ సోదాలు కలకలం రేపుతున్నాయి. వీళ్లిద్దరి కంపెనీల్లో ఉదయం నుంచి ఐటీ అధికారులు తనిఖీలు చేపట్టారు. దీంతో ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న తెలంగాణ రాజకీయం ఇప్పుడు మరోసారి హీట్ ఎక్కింది. గురువారం అమిత్‌షా తెలంగాణలో పర్యటించనున్నారు. ప్రముఖులతో సమావేశం కానున్నారు. ఖమ్మంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. మరోవైపు బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికార ఒప్పందం కుదిరిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ టైంలో సడెన్‌గా జరిగిన ఐటీ రైడ్స్ తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. అధికార పార్టీ బీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధుల ఇళ్లు, ఆఫీస్‌లు, వారి బంధువుల, సహచరుల నివాసాలపై కూడా ఐటీ కన్నేసింది. ఈ ఉదయం నుంచి మూకుమ్మడిగా సైలెంట్‌గా అధికారులు అటాక్ చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన కొత్త ప్రభాకర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి ఇంట్లో సోదాలు జరుగుతున్నాయి. ఇళ్లు, కంపెనీలు, షాపింగ్ కాంప్లెక్స్‌లలో తనిఖీలు చేస్తున్నారు. ప్రస్తుతం ముగ్గురు ప్రజాపతినిధులపై జరుగుతున్న ఐటీ రైడ్స్ తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారాయి. కొత్త ప్రభాకర్ రెడ్డి మెదక్ ఎంపీగా ఉన్నారు. ఆయన ఇంట్లో వేకువజాము నుంచే తనిఖీలు ప్రారంభించారు. కొండాపూర్ లోని లుంబిని ఎస్ఎల్ఎన్ స్ప్రింగ్స్ విల్లాస్‌లో ఎంపీ ఉంటున్నారు. ఆయన ఇంటితోపాటు ఆఫీసుల్లో కూడా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. పైళ్ల శేఖర్ రెడ్డి యాదాద్రి జిల్లాలో భువనగిరి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన నివాసం, కంపెనీల్లో కూడా తనిఖీలు చేపట్టింది ఐటీ శాఖ. భువనగిరి, హైదరాబాద్ కొత్తపేట గ్రీన్ హిల్స్ కాలనీలోని ఆఫీస్, హిల్ ల్యాండ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, మెయిన్ ల్యాండ్ డిజిటల్ టెక్నాలజీస్ లిమిటెడ్‌లతోపాటు మొత్తం 12 చోట్ల సోదాలు కొనసాగుతున్నాయి. ఈ రెండు కంపెనీలకు శేఖర్ రెడ్డి భార్య వనిత డైరెక్టర్‌గా ఉన్నారు. ఒక్క ఎమ్మెల్యే నివాసాలు, బంధువుల ఇళ్లు, ఆఫీస్‌లపై సోదాల కోసమే 30 టీంలు పని చేస్తున్నాయి. మర్రి జనార్ధన్ రెడ్డి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయనకు చెందిన షాపింగ్ మాల్‌పై ఐటీ శాఖ గురిపెట్టింది. కేపీహెచ్‌బీ కాలనీలోని జేసీ బ్రదర్స్‌లో ఐటీశాఖ రైడ్స్ చేసింది. ఉదయం 6 గంటల నుంచి సోదాలు కొనసాగుతున్నాయి.

# హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు

### బిపోర్ జాయ్ తుఫాన్ ఎఫెక్ట్‌తో అమిత్ షా బిజీ

### గుజరాత్‌లో సహాయక చర్యలపై ప్రత్యేక శ్రద్ధ

న్యూఢిల్లీ,జూన్14 : కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ టూర్‌పై బిపోర్ జాయ్ తుపాన్ ఎఫెక్ట్ పడింది. ఆయన పర్యటన రద్దయినట్లుగా బీజేపీ వర్గాలు తెలిపాయి. గుజరాత్‌ను వణికిస్తున్న బిపర్‌జాయ్ తుఫాన్ కారణంగా అక్కడ సహాయక చర్యలను అమిత్ షా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. దీంతో తన పర్యటనను రద్దు చేసుకున్నారు. ప్రధానంగా గుజరాత్ పైనే తుఫాన్ ప్రభావం చూపనుండడంతో అమిత్ షా మరింత ఎక్కువగా ఆ రాష్ట్రంలో పరిస్థితులపై దృష్టి పెట్టాల్సి ఉంది. ఇప్పటికే గుజరాత్ హై అలర్ట్ లో ఉంది. బిపర్జోయ్ తుఫాన్ సన్నద్ధతపై గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ కేంద్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటున్నారు. బిఫర్‌జాయ్ తుఫాన్ గంటకు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో గురువారం సాయంత్రం తీరం దాటనుంది. ఖచ్చితంగా గురువారం మొత్తం అమిత్ షా హైదరాబాద్‌లో ఉండేలా షెడ్యూల్ ఖరారైంది. గుజరాత్‌లో తుపాను పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు మానిటర్ చేయాల్సి ఉన్నందున పర్యటనను రద్దు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. బిపోర్ జాయ్ తుఫాను విపత్కర ప్రభావాన్ని అంచనా వేస్తూ పలు ప్రభుత్వ సంస్థలు తీరప్రాంత జిల్లాలైన సౌరాష్ట్ర, కచ్ లలో సహాయక చర్యలు ముమ్మరం చేశాయి. గంటకు 110 కిలోమీటర్ల వేగంతో ముందుకు సాగుతోందని రిపోర్టులు పేర్కొంటున్నాయి. గుజరాత్‌లోని ఎనిమిది జిల్లాల్లో సముద్రం సమీపంలో నివసిస్తున్న దాదాపు 37,800 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది.

# దశాబ్ది ఉత్సవాలతో బిఆర్ఎస్ నేతల బిజీ

### ఊరూవాడ కార్యక్రమాల్లో పాల్గొంటున్న నేతలు

### పలు కార్యాక్రమాల్లో ఆశావహ నేతల సందడి


# తెలంగాణలో దంచికొడుతున్న ఎండలు

### వడగాడ్పుల ప్రమాదం ఉందని వాతావరణశాఖ హెచ్చరిక



హైదరాబాద్,జూన్14: నైరుతి రుతు పవనాలు ఆసల్యం కావడంతో తెలంగాణలో ఎండలు దంచికొడుతున్నాయి. రాగల మూడు రోజులు ఎండలు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. పలు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంటూ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వన పర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది.అదే సమయంలో ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్,భూపాలపల్లి,ములుగు, కొత్తగూడెం, ఖమ్మం,నల్గొండ,సూర్యాపేట,వరంగల్,హన్మకొండ, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడ వడగాలు వీస్తాయని పేర్కొంది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో.. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, నల్గొండ, జిల్లాలతో పాటు జగిత్యాల, పెద్దపల్లి, ఖమ్మంలోని పలు ప్రాంతాల్లో వడగాల్పులు వీస్తాయని తెలిపింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## ప్రజానాడి




# ఆప్ కి బార్ కిసాన్ సర్కార్

### అంటే రైతులకు సంకెళ్లు వేయడమా

### కెసిఆర్‌పై ట్విట్టర్ వేదికగా షర్మిల విమర్శలు

హైదరాబాద్,జూన్14 : ఆర్ఆర్ఆర్ అలైన్మెంట్ మార్పుపై ఆందోళన చేసిన యాదాద్రి జిల్లా రాయగిరి రైతులను పోలీసులు సంకెళ్లు వేసి కోర్టుకు తీసుకురావడంపై వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దొర పాలనలో న్యాయమడిగిన అన్నదాతకు తప్పని సంకెళ్లు అంటూ విరుచుకుపడ్డారు. 'ఆప్ కి బార్ కిసాన్ సర్కార్ ' అంటే ఇదేనా దొరగారు? అంటూ ప్రశ్నించారు.నమ్ముకున్న భూమిని ఇచ్చేది లేదంటే బేడీలు వేయడమా మీరిచ్చే భరోసా అని వైఎస్సార్టీపీ అధినేత్రి నిలదీశారు. ట్వీట్టర్ వేదికగా స్పందిస్తూ...మీ బందిపోట్లను ప్రశ్నిస్తే రైతు అని చూడకుండా జైలుకు పంపడమేనా మీ నినాదం ?. మద్దతు ధర అడిగితే సంకెళ్లు. పంట కొనండని అడిగితే సంకెళ్లు. భూములు పోయాయని అడిగితే సంకెళ్లు. భూములు ఇవ్వం అని చెప్పినా సంకెళ్లు. ఆక్రందన, ఆవేదన, ఆందోళన ఏది చూపినా రైతుకు దొర ఇచ్చే గిఫ్ట్ సంకెళ్లు. కిసాన్ బరోసా అని, వచ్చేది రైతు ప్రభుత్వమని, చెప్పుకొనేందుకు సిగ్గుపడు దొర సిగ్గుపడు. మీది భరోసానిచ్చే సర్కార్ కాదు. 'రైతుకు బేడీలు వేసే సర్కార్'. రైతును బర్బాద్ చేసే సర్కార్. రారాజును తీవ్రవాదిగా చూసే సర్కార్. రైతులను ఉగ్రవాదుల్లా చిత్రీకరించి సంకెళ్లు వేసిన కేసీఆర్ ఒక తాలిబానా' అంటూ ఆగ్రహం వ్యక్తం వేశారు.

## రైతన్నన్నను కుంగదీస్తున్న వర్షాభావం

### తొలకరి ఆలస్యంతో రైతుల్లో ఆందోళన

### నైరుతి కోసం అన్నదాతల ఎదురుచూపు

హైదరాబాద్,జూన్14 : ప్రస్తుత వాతావరణం చూస్తుంటే ఇంకా ఎండా కాలం కొనసాగుతున్నట్లుగా ఉంది. వర్షాలు ముఖం చాటేయడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. తొలకరి రాక ఆలస్యం కావడంతో ఇప్పటికే దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు రైతులు సిద్దంగా ఉన్నారు. కొన్నిచోట్ల పత్తి నాటుకున్నారు. దీంతో ఆ రైతుల్లో ఆందోళన తీవ్రం అవుతోంది. గత వారంరోజులుగా వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే మండుటెండలు, వడగాల్పులు చూస్తుంటే మరో వారం దాకా తొలకరి చిలకరించే పరిస్థితి కానరావడం లేదు. ఇప్పటికే నైరుతి ఆలస్యంగా వచ్చింది. దీంతో సాగు భూములకు నీరు లేక నెర్రెలు బారుతున్నాయి. తొలకరి వర్షాలతో విత్తనాలు మొలకెత్తాల్సిన సమయమిది. వర్షాలు లేకపోవడం వల్ల మొలిచిన మొక్కలు ఒక పక్క ఎండుతుండగా, మరో పక్క సాగు భూములు నెర్రులు పడుతున్నాయని రైతులు వాపోతున్నారు.

# తెలంగాణలో ఐదింటికి గ్రీన్ అవార్డులు

## అవార్డులు దక్కించుకున్న యాదాద్రి,సచివాలయం

## దుర్గం చెరువు ,మోజంజాహి మార్కెట్,కమాండ్ కంట్రోల్ సెంటర్

## అవార్డులపై హర్షం వ్యక్తం చేసిన సిఎం కెసిఆర్




హైదరాబాద్,జూన్14 :తెలంగాణను ఐదు అంతర్జాతీయ అవార్డులు వరించాయి. సచివాలయం, యాదాద్రి ఆలయం, మొజంజాహీ మార్కెట్, దుర్గం చెరువు, కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణాలకు లండన్‌లోని గ్రీన్ ఆర్గనైజేషన్ అందిస్తున్న గ్రీన్ యాపిల్ అవార్డులు దక్కాయి. భారత్‌కు గ్రీన్ యాపిల్ అవార్డులు రావడం ఇదే పప్రథమమని ఈ సందర్భంగా గ్రీన్ ఆర్గనైజేషన్ వెల్లడించింది. బ్యూటిఫుల్ వర్క్‌స్పేస్ బిల్డింగ్ కేటగిరీలో తెలంగాణ సచివాలయానికి, హెరిటేజ్ కేటగిరీలో మొజంజాహీ మార్కెట్‌కు, యూనిక్ డిజైన్ కేటగిరీలో దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జికి, స్పెషల్ ఆఫీస్ కేటగిరీలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు, అద్భుతమైన మతపరమైన నిర్మాణాల విభాగంలో యాదాద్రి ఆలయానికి గ్రీన్ యాపిల్ అవార్డులు వచ్చాయి. మే 16న లండన్‌లో జరగనున్న అవార్డుల ప్రదానోత్సవంలో స్పెషల్ సీఎస్ అరవింద్ కుమార్ ఈ అవార్డులను అందుకోనున్నారు. కాగా, తెలంగాణకు ఐదు అంతర్జాతీయ అవార్డులు రావడం పట్ల సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ది గ్రీన్ ఆర్గనైజేషన్ 1994లో లండన్‌లో ఏర్పాటైంది. ఇది ఒక స్వచ్ఛంద సంస్థ. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ గురించి ప్రచారం చేయడంతో పాటు.. ఇందుకు కృషి చేస్తున్న వారిని ఇది గుర్తించి అవార్డులు అందిస్తున్నది. ఈ మేరకు 2016 నుంచి గ్రీన్ యాపిల్ అవార్డులు మొదలుపెట్టింది. పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తున్న సంస్థలు, కౌన్సిల్స్, కమ్యూనిటీలకు ఇది అవార్డులను అందిస్తున్నది. అత్యంత విశాలమైన ప్రదేశంలో ఆకర్షణీయంగా నిర్మించడంతో పాటు ఇతరత్రా విషయాలను పరిగణలోకి తీసుకుని భవన నిర్మాణాలకు ఇంటర్నేషనల్ బ్యూటిఫుల్ బిల్డింగ్స్ గ్రీన్ యాపిల్ అవార్డులను అందజేస్తున్నది. నివాసాలు, కోటలు, మ్యూజియం, బ్రిడ్జిలు, మతపరమైన స్మారక కట్టడాలు, వారసత్వ కట్టడాలు.. ఇలా వివిధ కేటగిరీల్లో ఈ అవార్డులు ఇస్తున్నది. గతంలో లండన్‌లోని బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిలిం అండ్ టెలివిజన్ ఆర్ట్స్, నేషనల్ మ్యూజియం ఆఫ్ ఖతార్, మలేసియాలోని జలాన్ మహ్‌కోట ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నాయి.

# వైద్యరంగం బలోపేతమే మా లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

పిల్లల పెరుగుదలలో సమస్యలు ఉండకూడదని న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్నామని చెప్పారు. న్యూట్రిషన్ కిట్ ఇవ్వడం వెనుక చాలా ఆలోచన ఉందని సీఎం అన్నారు. ఈ కిట్లతో ఒక తరం ఆరోగ్యకరంగా ఉంటుందని వెల్లడించారు. వైద్యారోగ్యశాఖకు సహజంగా విమర్శలే ఎక్కువగా ఉంటాయని, ప్రశంసలు తక్కువన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో సామర్థ్యానికి మించి రోగులు వచ్చినా డాక్టర్లు వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. మూరుమూల ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు ప్రత్యేక సౌకర్యాలు అందిస్తున్నామని వెల్లడించారు. గతంలో దవాఖానల్లో 30 శాతం డెలివరీలు జరిగేవని, ఇప్పుడు 70 శాతానికి పెరిగాయన్నారు. వైద్యారోగ్య రంగంపై చక్కటి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గతంలో ఉస్మానియా, గాంధీ, నోలోఫర్ వంటి దవాఖానలే దిక్కని, ఇప్పుడు వరంగల్‌లో ప్రపంచంలో లేని అద్భుతమైన హెల్త్ సిటీని కడుతున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో మరో నాలుగు హాస్పిటళ్లు కడుతున్నామని వెల్లడించారు. రాష్ట్ర ప్రజలకు ఉత్తమ సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. కరోనా సమయంలో గాంధీ దవాఖాన అద్భుతమైన సేవలు అందించిందని చెప్పారు. ప్రైవేటు హాస్పిటళ్లు చేతులెత్తేసినా కరోనా రోగులను గాంధీ వైద్యులు కాపాడారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, వైద్యులు, సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు. అందరికి తెలంగాణ దశాబ్ది ఉత్సవాల శు భాకాంక్షలు తెలిపారు. మంత్రులు హరీష్ రావు, వేముల ప్రశాంతరెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. కెసిఆర్‌కు ఇక్కడ ఘనంగా స్వాగతం పలికారు.

# కేసిఆర్ స్వప్న సాకారం

(మొదటిపేజీ తరువాయి)

అత్యవసర సమయంలో ఆసుపత్రిలో జాయిన్ అయి డబ్బులు లేక వైద్యం పొందే వారికోసం 5కోట్ల 53 లక్షల 50 వేలు ఎల్ ఓ సి లు అందించామని, అలాగే సీఎం అర్ ఎఫ్ ద్వారా 24వేల 383 మందికి 60,79,93,146 రూపాయల చెక్కులుఇవ్వడం జరిగిందన్నారు. ధర్మపురిలో 50పడకల మాతా శిశు సంక్షేమ ఆసుపత్రి త్వరలో పూర్తి కానుందని, క్లస్టర్ ఆసుపత్రిని 50పడకలుగా, వైద్య విధాన పరిషత్ పరిధిలోకి తెచ్చి, 31మంది వైద్యులను తగిన సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. డయాలసిస్, ఆక్సీజన్ సౌకర్యాలు అందుబాటులో తెచ్చా మన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్, మంద మకరందు, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ లు అరుణ రాజేందర్, సుధారాణి, మున్సిపల్ చైర్ పర్సన్ సత్తమ్మ, డీ ఎం హెచ్ ఓ శ్రీధర్, డిప్యూటీడీ ఎం హెచ్ ఓ శ్రీనివాస్, డీ ఆర్ డీ ఓ లక్ష్మీ నారాయణ, మున్సిపల్ కమిషనర్ రమేశ్, తహసీల్దార్ వెంకటేశ్, వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ప్రజలు పాల్గొన్నారు. న్యూట్రీషియన్ కిట్స్ పంపిణీ చేశారు.వైద్య విధాన పరిషత్ లో పనిచేస్తూఅత్యుత్తమ సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బందికి మంత్రి షీల్డ్స్, ప్రశంస పత్రాలు అందించారు. నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు.

# వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం

## ఎపిలో విద్యుత్ ఛార్జీల మోతతో ప్రజల ఇక్కట్లు

## వైఎస్ ఆశయాలను తుంగలో తొక్కిన జగన్

## నేడు ప్రజాసంఘాలు, పార్టీలతో చర్చించి ఐక్య కార్యాచరణ

## పిసిసి చీఫ్ గిడుగు రుద్రరాజు ప్రకటన

విజయవాడ,జూన్14 : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించబోతుందని ఏపీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. బిజెపి పాలనతో ప్రజలు విసిగి పోయారని అన్నారు. బుధవారం రుద్రరాజు మీడియాతో మాట్లాడుతూ..బషీర్‌బాగ్ ఘటనలో నేను లాఠీ దెబ్బలు తిన్నాను. చంద్రబాబు హయాంలో పెరిగిన విద్యుత్ ఛార్జీలపై ఉద్యమించాం. ప్రస్తుతం విద్యుత్ చార్జీల పెంపుపై కాంగ్రెస్ పార్టీగా ఆందోళనకు సిద్ధమవుతున్నాం. ట్రూ అప్ ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రూ.1350 కోట్ల రూపాయలు వసూలు చేస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఛార్జీల బాదుడు బాదుతున్నారు. 500 యూనిట్ల దాకా చార్జీలు వసూలు చేస్తూ సామాన్యుల నడ్డి విరుస్తుంది. వైఎస్ ఉచిత విద్యుత్ ఇస్తే తనయుడు అధిక ఛార్జీలు వసూలు చేస్తూ వైఎస్ ఆశయాలను తుంగలో తొక్కుతున్నారు. విద్యుత్ ఛార్జీలపై గురువారం విజయవాడలో అన్ని పార్టీలు, ప్రజాసంఘాలతో సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రకటిస్తాం.‘ అని వెల్లడించారు. కడపలో మూడేళ్లలో స్టీల్ ఎ లాంట్ నిర్మిస్తామన్న జగన్.. నాలుగేళ్లయినా ఏం చేశారు. పోలవరం, రైల్వే జోన్, విశాఖ స్టీల్ ప్లాంట్‌పై అమిత్ షా ఎందుకు నోరుమెదపలేదు. ఏపీ సమస్యలు ప్రస్తావించకుండానే 20 సీట్లు వస్తాయనడం సిగ్గుచేటు. రాష్ట్ర, దేశ ప్రయోజనాల ముఖ్యమా.. పవన్, చంద్రబాబు, జగన్‌కు సొంత ప్రయోజనాల ముఖ్యమా? బీజేపీ ప్రభుత్వం జగన్, చంద్రబాబుతో దొంగాట ఆడుతున్నారు. ఏపీలో బీజేపీ బలమెంతో?.. ఎవరితో కలుస్తారో ప్రకటించాలని రుద్రరాజు డిమాండ్ చేశారు.అమెరికాలో రాహుల్ టూర్ విజయవంతంగా సాగింది. అడుగడుగునా ఎన్ఆర్ఐలు రాహుల్‌కు బ్రహ్మరథం పట్టారు. తెలుగు ప్రజలు అత్యధికంగారాహుల్‌పర్యటనలోపాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# అమిత్ షా పర్యటన రద్దు

ఖమ్మం,జూన్14 : అనివార్య కారణాల వల్ల కేంద్రమంత్రి అమిత్ షా ఖమ్మం పర్యటన వాయిదా పడిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతూ గుజరాత్ , మహారాష్ట్రలో బీభత్సం సృష్టిస్తున్న బిపర్‌జాయ్ తుఫాన్ కారణంగా అమిత్ షా పర్యటన రద్దయిందని అన్నారు. అమిత్ షా గుజరాత్‌లోనే ఉండి... తుపానును సమీక్షించాలని ప్రధాని మోదీ ఆదేశించారన్నారు. మోదీ, షా.. తుపాను సహాయక చర్యలను సమీక్షిస్తున్నారన్నారు. కాగా ఇప్పటి వరకు ఖమ్మంలో జరగని విధంగా అమిత్ షా బహిరంగ సభకు ఏర్పాట్లు చేశామని ప్రదీప్ కుమార్ తెలిపారు. ఖమ్మంలో అడుగడుగునా కాషాయమయం కావాలని, ఖమ్మం జిల్లా బీజేపీ నాయకులు 10 రోజులు కష్టపడి ఏర్పాట్లు చేశారన్నారు. రాబోయే రోజుల్లో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తామని ప్రదీప్ కుమార్ స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ..గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు తుఫాన్ గండం పొంచి ఉండడంతో కేంద్రమంత్రి అమిత్ షా పర్యటన వాయిదా పడిందనిఅన్నారు.

# గర్భంలోనే పిల్లల ఎదుగుదల సక్రమంగా ఉండాలి

- వారి ఆరోగ్యం కోసమే న్యూట్రిషన్ కిట్ల పంపిణీ
- సర్కార్ చర్యలతో ప్రభుత్వాసుపత్రుల్లో పెరిగిన ప్రసవాలు
- తెలంగాణలో వైద్యశాఖను బలోపేతం చేస్తున్నాం
- వైద్యశాఖ సమర్థతను తెలిసేలా పిఆర్ పెంచాలి
- నిమ్స్ కొత్త బ్లాక్ నిర్మాణం సంధ్బంగా కేసీఆర్



హైదరాబాద్,జూన్14(ప్రజామంటలు) :దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ లాంఛనంగా ప్రారంభించారు. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ లబ్దిదారులు పార్వతి,పర్వీనమ్మ, శిరీషమ్మ, తేజశ్విని, సుజాతమ్మ, రేణుకమ్మలకు న్యూట్రిషన్ కిట్లను సిఎం కేసీఆర్ స్వయంగా అందచేశారు. పుట్టే బిడ్డలు ఒడ్డూ పొడుగు బాగుండాలంటే వాళ్ళు గర్భంలో ఎదిగే కాలంలో ఎలాంటి ఆటంకం ఉండకూడదు. ఒకసారి స్టంటింగ్ సమస్య ఏర్పడితే, మళ్ళీ ఎదుగుదల చూడాలంటే వంద సంవత్సరాల కాలం పడుతుంది. చాలా మందికి ఈ విషయం తెలియదు. పెరుగుదలలో సమస్య రాకుండా ఉండాలంటే ముందస్తుగా చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ సమస్యను అధిగమించ చేదుకు పంచబడుతున్నవే న్యూట్రిషన్ కిట్లు. వీటి పరమార్థం ఇదే అని వివరించారు. గతంలో పేద గర్భిణులు ప్రసవానికి ప్రైవేట్ ఆసుపత్రికి పోయేది. ప్రభుత్వం తెచ్చిన కేసీఆర్ కిట్ల ద్వారా వారికి నగదు సాయంతో పాటు, ప్రసవానంతరం ఇచ్చి కిట్లతో నేడు ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగాయి. గతంలో హాస్పటల్స్ లో 30 శాతం ప్రసవాలు జరిగితే, నేడు 70 శాతం ప్రసవాలు హాస్పటల్స్‌లోనే జరుగుతున్నాయి. దానివల్ల మహిళల ఆరోగ్యం బాగుంటున్నది. అనవసరమైన అబార్షన్లు, దుర్మార్గపూరిత చర్యలు కూడా ఉండటం లేదు. సమాజాన్ని కాపాడుకోగలుగుతున్నాం. మాతా మరణాలు, శిశు మరణాలు చాలా తగ్గాయని కెసిఆర్ అన్నారు. నిమ్స్‌లో కొత్త బ్లాక్ శంకుస్థాపన సందర్భంగా కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఎం కేసీఆర్ మాట్లాడుతూ... ఎంచుకున్న రంగంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలనే మనిషి తపన వొకచోట ఆగేదికాదు వొడిసేదీ కాదు. నిరంతరం కొనసాగుతూనే వుంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే పలు రంగాలతో పాటు రాష్ట్ర వైద్యారోగ్య రంగంలో కూడా అద్భుతమైన అభివృద్ధిని నమోదు చేసుకున్న నేపథ్యంలో, అత్యద్భుత రీతిలో నిర్మించబోయే నిమ్స్ దవాఖానా విస్తరణ పనులకు శంఖుస్థాపన చేయడం భారతదేశ వైద్యారోగ్య రంగంలోనే చారిత్రక సందర్భమని సీఎం స్పష్టం చేశారు. నిమ్స్ దవాఖాన విస్తరణ లో భాగంగా నూతన భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం... వైద్యారోగ్య అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి సీఎం కేసీఆర్ గారి ప్రసంగించారు. సమాజ పురోగమనానికి అప్పిచ్చేవాడు ఉండాలి. వైద్యుడు ఉండాలి అంటూ వైద్యుని ప్రాముఖ్యత గురించి శతకకారుడు వివరంగా చెప్పారు. వైద్యానికి, మానవ జీవితానికి ఎడతెగని సంబంధం ఉంటుంది. ఈ ప్రపంచంలో మానవ జీవనం ఉన్నంత కాలం వైద్యం కూడా తప్పకుండా కొనసాగుతూనే ఉంటుంది. వైద్యారోగ్య శాఖ చాలా ప్రాధాన్యత కలిగిన శాఖ. ఏ సందర్భంలో నైనా చాలా లైవ్ గా ఉండాల్సిన శాఖ. వైద్యారోగ్య శాఖను చాలా అనూహ్యంగా విస్తరిస్తున్నాం. 17 వేల పడకల నుండి 50 వేల పడకలకు విస్తరించాం. వందో రెండొందలో ఉన్న ఆక్సిజన్ బెడ్లను 50 వేలకు పెంచుకున్నాం. కేంద్రాన్ని ప్రాధేయపడకుండా సొంతంగా 550 టన్నులు ఆక్సిజన్ ను ఉత్పత్తి చేసే ప్లాంట్లను ఏర్పాటు చేసుకున్నాం. నాకొక విచిత్రమైన అనుభవం ఉంది. మన ప్రాంతానికి సాధారణంగా మిడతల దండు రాదు. ఈ మధ్య మిడతల బెడద లేదు. వెనుకటి కాలంలో ఉండేది. మహాకవి శ్రీనాథుడు నిర్బంధంలో ఉండి చనిపోయే సమయంలో పాడతాడు. పొలం కౌలుకు చేసుకుంటుంటే కృష్ణవేణమ్మ కొంత తీసుకుని పోయింది. బిలబిలాక్షులు(మిడతలు) కూడా కొంత తీసుకుపోయిందని బాధపడతాడు. ఈ మధ్యకాలంలో మన దగ్గర మిడత బెడద లేదు. మధ్య ఆసియా నుండి ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ మీదుగా గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రానికి మిడతల దండు వస్తూంటుంది. నేను చాలా ఇంట్రస్టింగ్ స్జబెక్ట్ చెప్తున్నాను.ఈ మిడతల దండు హర్యానాలోకి వచ్చి అక్కడి నుండి మధ్యప్రదేశ్, మహారాష్ట్ర లోకి ప్రవేశించి, ఆదిలాబాద్ సరిహద్దు దాకా విస్తరిస్తూ వస్తున్నది. భారత ప్రభుత్వం హెచ్చరిక జారీ చేస్తే ఆదిలాబాద్ ఉత్తర భాగాన ఉన్న కలెక్టర్లను, ఎస్పీలను అప్రమత్తం చేసి ప్రజలను, పంటలను కాపాడుకునేందుకు ఫెరిరజన్లు, స్ప్రేలతో సన్నద్ధంగా ఉన్నాం. ఆ సందర్భంలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుండి ఒక మహిళా ఆఫీసర్, మన దగ్గర అగ్రికల్చర్ యూనివర్సిటీలోని ఇద్దరు ఎంటమాల జిస్టులు దీని పర్యవేక్షణ కోసం వచ్చారు. వారికి హెలికాప్టర్ ఇచ్చి సరిహద్దులకు పంపాం. మహారాష్ట్రలోనే మిడతల దండును చంపేయడం వల్ల, అవి మన దాకా రాలేదు. అనంతరం ఆ ఇద్దరు ఎంటమాలిస్టులు మమ్మల్ని కలిసి మాకు హెలికాప్టర్ ఇచ్చి, మమ్మల్ని గౌరవించి బాగా చూసుకున్నారని ధన్యావాదాలు తెలిపారు. సైన్స్ ఇంతగా అభివృద్ధి చెందిన ఈ కాలంలోనూ ఈ సమస్యకు పరిష్కారం ఎందుకు కనుక్కో లేదని నేను వారిని నా అకాడమిక్ ఇంట్రస్ట్ కొద్దీ ప్రశ్నించాను. సార్ మిడతలను చంపలేము. నిర్మూలించ లేము. అది అసాధ్యమని చెప్పారు మనిషి 4 లక్షల సంవత్సరాల క్రితం భూమి మీదకు వచ్చాడు. కానీ ఈ మిడతలు, బాక్టీరియాలు, ఇతరత్రా 8 లక్షల సంవత్సరాల క్రితమే ఉద్భవించాయి. అవి నిద్రాణంగా ఉంటాయి. వాటికి వ్యతిరేక చర్యలతో ప్రకోపం చెంది ఇబ్బందులు కలిగిస్తాయని ఎంటమాలజిస్టులు చెప్పారు. కరోనా కూడా అటువంటి దేనా అంటే అటువంటిదే అని వారు చెప్పారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రజల్ని ఎలా రక్షించు కోవాలో సలహాలివ్వాలని అడిగితే, ఎక్కడైతే వైద్యారోగ్య వ్యవస్థ పకడ్బందీగా ఉంటుందో అక్కడ తక్కువ నష్టాలు జరుగుతాయని వారు చెప్పారు. లేకపోతే నష్టాలు ఎక్కువగా జరుగుతాయని వారు తెలిపారు. ఆరోగ్యశాఖ ప్రాధాన్యతను దీన్ని ద్వారా అర్థం చేసుకోవచ్చు. అప్పటి నుండి ఎలాంటి ఆరోగ్య అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేలా ఆరోగ్యశాఖను తీర్చిదిద్దాలని భావించి, ఆరోగ్య శాఖ మంత్రులను, అధికారులను పిలిచి గంటలు, రోజులు, వారాల తరబడి చర్చించి అవసరమైన ఆర్థిక ప్రేరణ ఇవ్వడానికి బడ్జెట్ కేటాయింపులు కూడా భారీగా పెంచి ఈ శాఖను మనం ముందుకు తీసుకుపోతున్నాం అని కెసిఆర్ వివరించారు. ఈ రోజు మనం ఏ స్టేజ్ లో ఉన్నాం, ఇంకా ఎంత ముందుకు పోవాల్సి ఉంది ? జరగాల్సిన కొత్త ఆవిష్కరణలు ఏంటి ? చేపట్టాల్సిన చర్యలు ఏంటి ? అనే ప్రణాళికల కోసం ఎక్కువ సమయం కేటాయించాలని నేను ఆరోగ్యశాఖ అధికారులను కోరుతున్నాను. బెస్ట్ ప్లానింగ్ ఈజ్ హాఫ్ సక్సెస్ అంటే.. ఉత్తమ ప్రణాళికతో సగం విజయం సాధించినట్లేనని చెప్పినట్లు, వైద్యారోగ్య రంగం ఇంకెంత గొప్పగా ఉండాలి. ఇంకా ఎంతో ముందుకు పోవాలి. ఎలా ఈ లక్ష్యాలను ఎలా సాధించవచ్చో మీరు బాగా ఆలోచించగలరు. డాక్టర్లు గొప్పవారు. మంచి మనసున్న వాళ్ళు. నిరుపేదల వైద్యం కోసం వస్తే, బెడ్లు అందుబాటులో లేనప్పుడు ఉదారమైన హృదయంతో ఒక అరగంట ఎక్కువ పని చేసైనా కిందనే బెడ్డు వేసి వైద్యం అందిస్తారు. అది వాస్తవం. కానీ పత్రికలు, జర్నలిస్టులు అవాస్తవాలను ఉస్మానియాలో బెడ్లు లేవు. పేషెంట్లను కింద పడుకోబెడు తున్నరు అంటూ వక్రీకరణలు చేస్తారు. వైద్యారోగ్య శాఖ అధికారులకు పబ్లిక్ రిలేషన్స్ చాలా తక్కువ. మిమ్మల్ని విమర్శించే వాళ్ళు తప్ప మెచ్చుకున్న వాళ్ళు లేరు. నేను మీతో గంటల తరబడి మాట్లాడిన సందర్భాల్లో కలిగిన అనుభవాలు ఇవి. మనం కూడా మానవత్వ కోణంలో ఆలోచించాలి. వైద్యం ప్రత్యేక చదువు. ప్రత్యేకమైన అర్హత. ఐఎఎస్ లైనా, మంత్రులైనా, ముఖ్యమంత్రులైనా డాక్టర్ల దగ్గరకు రావాల్సిందే. ఒకసారి విచిత్రమైన సందర్భం వచ్చింది. ములుగు, భూపాలపల్లి ప్రాంతానికి పోస్టింగ్ లు ఇచ్చారు. వాళు ్ర జాయిన్ కావడం లేదు. కారణమేంటని నేను వాళ్ళను పిలిచి అడిగాను. మేం పోవడానికే సిద్దమే కానీ మా భార్యలు రావడం లేదని చెప్పారు. ఎందుకని అడిగితే అక్కడ ఒక ఒక సినిమా మాల్ లేదు, ఇతరత్రా సౌకర్యాలు లేవని తమ సమస్యలు చెప్పారు. ఈ సందర్భంగా వాళ్ళు తాలూకా కేంద్రంలో లేదా జిల్లా కేంద్రంలో ఉండేలా రూల్స్ సడలింపు చేయాలని చెప్పి అప్పుడున్న హెల్త్ సెక్రటరీ గారికి చెప్పాను. దాంతో పాటు వారికి ఎక్స్ ట్రా అలవెన్స్ కూడా ఇవ్వాలని చెప్పాను. పోలీస్ స్టేషన్ లలో, పోలీస్ ఉన్నతాధికారులను కలిసేందుకు వెళ్ళిన ప్రజలకు, ప్రముఖులకు పోలీసులు మర్యాద ఇస్తున్నారని, ఇది మంచి మార్పు అని భావిస్తున్నారు. వైద్యారోగ్య శాఖ మంత్రి మంచి చురకైన వ్యక్తి కాబట్టి వారికి నేను మనవి చేస్తున్నాను. వైద్యశాఖ అందించే సేవలు ప్రజల్లోకి పోయేలా పిఆర్ ను పెంపొందించాలి. ప్రజలతో పెనవేసుకున్న విభాగం కాబట్టి వైద్యారోగ్య రంగం పిఆర్ బాగా పెరగాలి. వైద్యారోగ్య శాఖ ప్రజల బాగు కోసం ఏం చేస్తుంనేది ప్రజలకు బాగా తెలిసేలా చర్యలు చేపట్టాలి. ప్రయత్నిస్తే ఫలితముంటుంది. మీ పీఆర్ బాగా పెరగాలి, మీ ప్లానింగ్ బాగుండాలి అని నేను మంత్రి గారిని కోరుతున్నాను. రాష్ట్రంలో గొప్పగా హాస్పటల్స్ కట్టుకుంటున్నాం. వరంగల్ లో ప్రపంచంలో ఎక్కడలేనటువంటి సూపర్ స్పెషాలిటి హాస్పటల్ ను కడుతున్నాం. ఒకప్పుడు నిమ్స్ లో 900 పడకలుంటే తెలంగాణ వచ్చిన తర్వాత 1500 పడకలకు తీసుకునిపోయాం. మరో 2000 పడకలను మనం కట్టుకుంటున్నాం. హైదరాబాద్ లో టిమ్స్ కింద నాలుగువైపులా నాలుగు సూపర్ స్పెషాలిటి హాస్పటల్స్ కట్టుకుంటున్నాం. విదేశాలకు పోకుండా ఇక్కడే అద్భుతమైన వైద్య సేవలు, టెలిమెడిసన్ బాగా వినియోగిం చడం, వీటి సమాహారంగా అద్భుతాలను ఆవిష్కరించే అవకాశం ఉంటుంది. ప్రజల బాగు కోసం ఇంకా ఏం చేయాలనే తపన వైద్యాధికారులకు ఉండాలని కెసిఆర్ సూచించారు. క్వెస్ట్ ఫర్ ఎక్స్ లెన్స్ నెవర్ ఎండ్స్ (శ్రేష్ఠత కోసం పడే తపన నిరంతరమైనది). శ్రేష్ఠత, సంస్కరణల కోసం చేసే పనులకు ముగింపు ఉండదు. ఉత్తమోత్తమ సేవలు ప్రజలకు అందించడానికి, కరోనా వంటి మహమ్మారి వ్యాపిస్తే కూడా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. కరోనా కాలంలో తెలంగాణ వైద్యారోగ్య శాఖ గొప్పగా పనిచేసింది. ప్రైవేట్ హాస్పటల్స్ లో కరోనా సోకిన పేషెంట్ పరిస్థితి విషమిస్తే గాంధీ హాస్పటల్స్ కు పంపించే వారు. గాంధీ డాక్టర్లు అటువంటి పేషెంట్స్ ను కూడా బతికించారు. వారి సేవలకు నేను శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. గొప్పగా సేవలు అందించారు. వైద్య విధానం కొత్త పుంతలు తొక్కుతున్న నేటి కాలంలో మన రాష్ట్రంలోని పరిస్థితులకు అధ్యయనం చేసి, అందుకు అనుగుణంగా వైద్యసేవలు అందించేలా వైద్యులు ప్రణాళికలు రూపొందించాలి. వైద్యారోగ్య శాఖ మీదున్న అపవాదును తొలగించుకొని, రాష్ట్రంలో వైద్యశాఖే నెంబర్ వన్ అని పేరొచ్చేలా కృషి చేయాలి. వైద్యారోగ్య సాధించిన విజయాలను మనస్ఫూర్తిగా అభినందిస్తూ, మరోసారి మీకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు, మంత్రులు మహమూద్ అలీ, వేముల ప్రశాంత్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజ్యసభ సభ్యులు కె.కేశవరావు, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, తాత మధు, మహిళా కమిషన్ చైర్మన్ సునితా లక్ష్మారెడ్డి, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, డైరక్టర్ గడల శ్రీనివాస్, మెడికల్ హెల్త్ డైరక్టర్ రమేశ్ రెడ్డి, టిఎస్ ఎంఎస్ ఐడీసీ చైర్మన్ ఎర్రోల్ల శ్రీనివాస్, నగర మేయర్ విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, సిఎం ప్రధాన సలహాదారు సోమేశ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి,సిఎం కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, సిఎం వోఎస్డీ గంగాధర్, చంద్రశేఖర్ రెడ్డి, నిమ్స్ డైరక్టర్ బీరప్ప, పర్యాటక శాఖ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, వికలాంగుల కార్పోరేషన్ చైర్మన్ వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశానికి ఆదర్శంగా

# తెలంగాణ వ్యావసాయం

### అంతటా అమలు చేస్తే హరిత విప్లవం సాధ్యమే

### బిజెపికి రాజకీయాలు తప్ప అభివృద్ధి పట్టదు: ఎమ్మెల్యే

నిజామాబాద్,జూన్14 (ఆర్ఎన్ఎ):తెలంగాణలో సిఎం కెసిఆర్ అనుసరిస్తున్న రైతు విధానాలతో పాటు అమలు చేస్తున్న అనేక కార్యక్రమాలు భారతదేశ వ్యాప్తంగా అమలు చేస్తే దేశంలో హరితవిప్లవం సాధించవచ్చని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రైతులకు సాగునీరు, పెట్టుబడి పథకం,బీమా పథకం అమలు చేయడం, పండిన ధాన్యం కొనుగోలు చేయడం వంటి పథకాలు పక్కాగా అమలయితే దేశంలో కరువు కాటకాలు ఉండవన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడరని అన్నారు. ఇవన్నీ సాకారం చేసుకునే దిశగా తెలంగాణ ఒక్కో అడుగు వేస్తున్నదని, వేసిన అడుగు విజయవంగా సాగుతున్నదని అన్నారు. ఇప్పటికే తెలంగాణ వ్యవసాయ రంగంలో ఓ రోల్ మాడల్‌గా నిలవబోతున్నదని అన్నారు. రైతుబీమా పథకం దేశానికే మార్గదర్శకంగా మారనుందని అన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలని తపిస్తున్న సిఎం కెసిఆర్ రైతును రాజు చేయడమే లక్ష్యంగా అనేకానేక చర్యలు తీసుకుని మమ్మల్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. ఇలా వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. వ్యవసాయ రంగానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషి, ప్రవేశపెట్టిన పథకాలు గురించి సీఎం కేసీఆర్.. ప్రధాని మోదీకి వివరించినా పాటించే స్థితిలో లేరని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ వ్యవసాయరంగంలో నంబర్‌వన్ రాష్ట్రంగా నిలిచిందని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతు బీమా అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని అన్నారు. ఏ కారణం చేతనైనా రైతు మరణిస్తే నామినీకి పది రోజుల్లో రూ.5 లక్షల ఇన్సూరెన్స్ అందుతుందని చెప్పారు. అందుకే ఈ పథకాలను తెలుసుకున్న దేశంలోని అన్ని రాజకీయపార్టీలు సీఎం కేసీఆర్‌ను కొనియాడుతు న్నాయన్నారు. రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ రైతుబీమా పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారని అన్నారు. ఎన్నడూలేని విధంగా పంటలకు మద్దతు ధర కల్పిస్తు న్నామని, పక్క రాష్ట్రాల్లో సరైన మద్దతు ధర లభించని రైతులు కూడా తెలంగాణకు వచ్చి అమ్ముకుంటున్నారని తెలిపారు. పోడు భూముల్లో వ్యవసాయం చేసే రైతులకు కూడా ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. కాళేశ్వరం సహా చేపట్టిన అన్ని ప్రాజెక్టులు పూర్తయితే ఇక సాగునీటికి ఢోకా ఉండదన్నారు. ఇప్పటికే చెరువుల పునరుద్ధరణ కారణంగా జలకళను సంతరించుకున్నాయని అన్నారు. దీంతో సేద్యం అన్నది రైతుకు భారం కాబోదన్నారు.

దేశంలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ ఒక్కటే అని పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రైతు సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించుకుని, అమలు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎన్నో ఇబ్బందులను అధిగమించి ముందుకు సాగుతుంటే కాంగ్రెస్ వాళ్లు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో మాదిరిగా రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా విత్తనాలు, ఎరువులు ముందుగానే స్టాక్ పెట్టుకుంటున్నమని పేర్కొన్నారు.

పండిన పంటకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నమని పేర్కొన్నారు. తెలంగాణలో 24గంటల కరెంట్, నీళ్లు, పెట్టుబడి, ఎరువులు, విత్తనాలు ఇస్తున్నరని, తాముకూడా తెలంగాణలో కలుస్తామని మహారాష్ట్ర, కర్నాటక బార్డర్ రైతులు అంటున్నారని తెలిపారు. వ్యవసాయానికి ఇన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తున్న సీఎం దేశంలో కేసీఆర్ ఒక్కరేనని ఆయన స్పష్టంచేశారు

# దశాబ్ది ఉత్సవాలతో బిఆర్ఎస్ నేతల బిజీ

కరీంనగర్,జూన్ 14 : ఉమ్మడి జిల్లాలో దశాబ్ది ఉత్సవాలు జెరుగగా సాగుతున్నాయి. రోజుకో కార్యక్రమంతో ముందుకు సాగుతున్నారు. బిర్ఎస్ నేతలంతా ఎక్కడికక్కడే పాల్గొంటున్నారు. కార్యక్రమంలో భాగంగా పలు పనులు చేపడుతున్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా టీఆర్ఎస్ అధ్య క్షుడు, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుల నేతృత్వంలో జగిత్యాల, చొప్పదండి ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్, సుంకె రవి శంకర్ నిత్యం ప్రజల్లోకి వెళు న్నారు. జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, రాయికల్, మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపాలిటీల్లో ఆయా మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, కౌన్సిలర్లు పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో, మండలాలు, గ్రామాల్లో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో పాటు టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పల్లె ప్రగతి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని మల్యాల, కొడిమ్యాల, వేములవాడ సెగ్మెంట్ పరిధిలోని మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో తుల వద్దకు వెళ్తోంది. జిల్లాలో ప్రధాన రాజకీయ పక్షాలకు చెందిన బాధ్యులతో పాటు ఆయా పార్టీల నుంచి టిక్కెట్లను ఆశిస్తున్న పలువురు నేతలు సైతం ప్రజల్లోకి వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా జగిత్యాల, కోరుట్ల సెగ్మెం ట్‌లో ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే పార్టీలో ఉన్న ద్వితీయ శ్రేణి నేతలు చాపకింద నీరులా చొచ్చుకుపోవడానికి ప్రయత్నిస్తున్నారు. వ్యక్తిగత ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికితోడు ఏ పార్టీకి సంబంధం లేకుండా ఇతర ఆశావహులు సైతం పావులు కదుపుతున్నారు. సేవా కార్యక్రమాల పేరిట ప్రజల్లోకి వెళ్తున్నారు. వైద్య శిబిరాలను నిర్వహించడం, స్వచ్ఛంద సేవా సంస్థల కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవడం, విరాళాలు ఇవ్వడం, సహాయాలు చేయడం వంటి పనులను నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఆశావహులు తమ నియోజకవర్గాల్లో ఇటీవల ప్రచారంలోకి వస్తున్న సర్వేలపై ఆసక్తి చూపుతున్నారు.

# గిరిజన బంధు ను వెంటనే అమలు చేయాలి



రాయికల్ జూన్ 14 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం గడిచిన గిరిజన అభివృద్ధిపై ఎలాంటి ప్రభావం చూపలేదని జగిత్యాల జిల్లా లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మాలవత్ సురేందర్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులకు ఏటా ఎస్టీ కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలను పూర్తిగా విస్మరించారని, గత మూడు నాలుగు సంవత్సరాలుగా ఎలాంటి నిధులు విడుదల కాకపోవడంతో ఎస్టీ కార్పొరేషన్ ద్వారా లబ్ధి పొందాల్సిన గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఈ ఆర్థిక సంవత్సరంలో గిరిజనులకు అత్యల్పంగా బడ్జెట్ను కేటాయించడం ద్వారా ప్రభుత్వానికి గిరిజనులపై ఉన్న నిర్లక్ష్య ధోరణికి ఉదాహరణగా తీసుకోవచ్చని, గిరిజన తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసి ఎలాంటి ప్రత్యేక గ్రాండ్ ఇవ్వకపోవడం గిరిజన గ్రామ పంచాయతీలకు అభివృద్ధిని అడ్డుకోవడమేనని కాబట్టి ప్రభుత్వం దృష్టి సారించి గిరిజన గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు, గిరిజనబంధు ను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# దశాబ్ది ఉత్సవాలు, వైద్య ఆరోగ్య దినోత్సవం



రాయికల్ జూన్ 14 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నేడు వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాయికల్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో సూపరిండెంట్ డాక్టర్ రవి ఆధ్వర్యంలో పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి మాట్లాడుతూ.... తెలంగాణ ఏర్పడిన తర్వాత దశాబ్ది ఉత్సవాలు రాష్ట్రమంతా జరుపుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని అన్నారు ఈరోజుల్లో కెసిఆర్ కిట్టు గాని న్యూట్రిషన్ కిట్టు గాని గర్భిణులకు ఎంతో మేలు చేస్తుంది అని అన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు మా యొక్క వైద్య సేవలు వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెవి ముక్కు గొంతు వైద్య నిపుణులు డాక్టర్ రమేష్ డాక్టర్ నరేంద్ర, స్టాఫ్ నర్సులు ప్రమిత, మమత, మంజుల, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఫార్మసిస్ట్ ఖలీల్, ల్యాబ్ టెక్నీషియన్ రంజిత్, అటెండర్ నర్సయ్య, పేషెంట్ కేర్ సిబ్బంది రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నిట్ ఎన్.సి.సి. విద్యార్థుల రక్తదానం



హనుమకొండ జూన్ 14 (ప్రజామంటలు): నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ 1 (టి) సిటిఆర్ ఎన్.సి.సి. యూనిట్ ఎన్.సి.సి. గ్రూప్ హెడ్ క్వార్టర్స్, వరంగల్ ఆధ్వర్యంలో ప్రపంచ దాతల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం "రక్తదాన్ మహోత్సవ్"లో పాల్గొన్నారు. హన్మకొండలోని రెడ్క్రాస్ బ్లడ్ బ్యాంక్ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఐటీ వరంగల్కు చెందిన 20 మంది క్యాడెట్లు రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు అని డా. డి. హరి, ఎన్సీసీ అధికారి తెలిపారు. రక్తదానం చేసిన విద్యార్థులను పలువురు అభినందించారు.

# బీసీ కులాలలో చేనేత పద్మశాలీలను చేర్చాలి




జనగామ జూన్ 14 (ప్రజామంటలు): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీలకు లక్ష రూపాయల పథకంలో పద్మశాలీలను చేర్చకపోవడం వివక్షకు గురి చేయడమేనని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు మంగళంపల్లి జనార్దన్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జనగామలో జరిగిన సమావేశంలో దర్శనం వెంకటేష్ అధ్యక్షత వహించగా జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... ఈ నోటిఫికేషన్ లో చేర్చకుండా అడిగితే సవరిస్తామ నడం సరైనది కాదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బంటు పాండు, దండుగుల ఐలయ్య, కుమ్మరి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే సంజయ్



జగిత్యాల (ప్రజామంటలు): జగిత్యాల అర్బన్ మండల తిప్పన్నపేట్ గ్రామానికి చెందిన బండ వంశీ సుమంగళి గార్డెన్స్ దగ్గర రోడ్డు ప్రమాదంలో గాయపడి రోడ్డుపై పడి ఉండగా అటుగా వెళుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, వంశీని ఆటోలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఫోన్ ద్వారా వైద్యులను కోరారు. గాయపడిన వంశీకి ఎమ్మెల్యే స్వయంగా ఆసుపత్రి తరలించి చికిత్స అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

**తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 17న గిరిజన ఉత్సవం జరుపుకుంటునందున అదే రోజు గిరిజన బంధు పథకాన్ని ప్రకటించాలని, దశాబ్ది ఉత్సవాలలో గిరిజన బంధు ఇచ్చేందుకు జీవో విడుదల చేయాలని ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన సేవాలాల్ సేన జిల్లా నాయకులు లావుడియా అనిల్ చౌహాన్.**



# మహాజన్ సంపర్క్ అభియాన్‌కోరుట్ల నియోజకవర్గ మోర్చాల సంయుక్త సమ్మేళనం



మెట్ పల్లి జూన్ 14 (ప్రజామంటలు): మెట్ పల్లి వాసవి గార్డెన్లో జరిగిన బిజెపి పార్టీ మహాజన్ సంపర్కు అభియాన్ కార్యక్రమం జరిగింది. నరేంద్ర మోడీ 9 సంవత్సరాల సుపరిపాల దినోత్సవం పురస్కరించుకొని మహాజన్ సంపర్క్ అభియాన్లో భాగంగా కోరుట్ల నియోజకవర్గ మోర్చాల సంయుక్త సమ్మేళనం స్థానిక వాసవి గార్డెన్లో నిర్వహించడం జరిగింది. ఈ యొక్క సమ్మేళనానికి అధ్యక్షత వహించిన బిజెపి జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ రావు, అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.... నరేంద్ర మోడీ 9 సంవత్సరాల పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దేశం లోనే కాకుండా ప్రపంచంలోనే భారతదేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దే ప్రయత్నానికి మరొక్కసారి మోడీకి మద్దతు పలకాలని పిలుపు నిచ్చారు. ఉజ్వల పథకం కింద లబ్ధి పొందిన లబ్ధిదారు లను గుర్తించాలని రాష్ట్రంలో టిఆర్ఎస్ పరిపాలన కమిషన్ల పాలనగా తయారైందని నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంలో కార్యకర్తలు ప్రధాన పాత్ర పోషించా లని నవ భారత నిర్మాణం కొరకు నరేంద్ర మోడీ కి మద్దతు పలుకుతూ యువత పెద్ద ఎత్తున బిజెపిలోకి రావాలని టిఆర్ఎస్ మోస పూరిత వాగ్దానాలను ప్రజలకు తెలియజేస్తూ బిజెపి సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామ సుధాకర్, తుల ఉమ, సాంబార్ ప్రభాకర్, జే.ఎన్. వెంకట్, సురభి నవీన్ కుమార్, పార్లమెంట్ ప్రబారి రమణి, పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, పార్లమెంట్ కో కన్వీనర్ గుంటుక సదా శివం, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మధుకర్, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గ నాయకురాలు జె.ఎన్. సునీత, శ్రీధర్ బిజెపి మెట్ పల్లి పట్టణ అధ్యక్షులు బోడ్ల రమేష్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధోనికెలా నవీన్, బద్దం గంగాధర్, ఎర్ర లక్ష్మి, యాదగిరి బాబు, మిట్టపల్లి సాయి కుమార్, వివిధ మోర్చాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముగిసిన సామూహిక శ్రీ లలితా సహస్రనామ పారాయణం



జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు): స్థానిక గోవింద్ పల్లి, మోతే శివార్లలో నవదుర్గ నగర్ లో ఈ మధ్య స్థాపితమైన నవదుర్గ మాత పీఠం వద్ద గత ఐదు రోజులుగా అఖండ శ్రీ లలితా సహస్రనామ పారాయణం అంగరంగ వైభవంగా జరిగింది. ఐదు రోజులపాటు ఎంతో అద్భుతంగా జరిగిన పారాయణం బుధవారం ఉదయం ముగిసింది. మహిళలు భజనలు కోలాటాలతో అలరించారు. అమ్మవారి పీఠం పరిసరాలు మొత్తం ఆధ్యాత్మిక శోభతో వెలిగి పోయాయి. భక్తులందరికీ ఈ ఐదు రోజులు రెండు పూటలా అల్పాహారం ,పగలు భోజనం ఏర్పాటు చేశారు. ప్రముఖ జ్యోతిష వాస్తు పౌరాణిక వేద పండితులు శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక ప్రత్యక్ష పర్యవేక్షణలో కార్యక్రమాలన్నీ రూపుదిద్దుకున్నాయి. ప్రముఖ పౌరాణిక వేద పండితులు తిగుల్ల విశుశర్మ కార్యక్రమ క్రతువు నిర్వహించారు. జ్యోతిష ఆగమ శాస్త్ర ప్రకారం శృంగేరి తరహాలో ఆలయ నిర్మాణానికి సంకల్పం జరిగింది. అదే తరహాలో నిర్మాణం జరగాలని సేవా సమితి సభ్యులకు నంబి వేణు గోపాలాచార్య మంగళ శాసనాలతో పాటు దిశా నిర్దేశాన్ని సూచించిన ప్రముఖ జ్యోతిష్య వాస్తు పౌరాణిక వేద పండితులు. ఈనాటి కార్యక్రమంలో నవదుర్గ సేవ సమితి సభ్యులు గీత సత్సంగ్ కార్యదర్శి పాపట్టి రవీందర్, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, గుడి కందుల వెంకన్న, గుడాల రాజేష్ , రమేష్ రెడ్డి, పాంపట్టి సులోచన, తౌటు శ్రీదేవి, రాజమణి, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# గాగిరెడ్డిపల్లి లో మహాలక్ష్మీ భూలక్ష్మి (బొడ్రాయి) కార్యక్రమం



పాల్గొన్న రఘునాథ్ రెడ్డి

చిగురుమామిడి జూన్ 14 (ప్రజామంటలు): చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి గ్రామంలో మహాలక్ష్మి భూలక్ష్మి (బొడ్రాయి) కార్యక్రమం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా పోచమ్మ బోనాలతో పాటు కుంకుమ పూజ విగ్రహాల ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సీనియర్ జర్నలిస్ట్ గాదే రఘునాథ్ రెడ్డి విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించగా వేద పండితులు గుజ్జ రాజన్న శర్మతోపాటు కిరణ్ శర్మ తదితరులు అమ్మ వారి కండువా కప్పి ఆశీర్వదించారు. అనంతరం ఏర్పాటు చేసి, ప్రతిష్టించిన మహాలక్ష్మి భూలక్ష్మి బొడ్రాయి విగ్రహాలను గ్రామ సర్పంచ్ సన్నిల వెంకటేశం ఉప సర్పంచ్ అన్నాడి మల్లికార్జునరెడ్డి తో పాటు ప్రభుత్వ పాఠశాల చైర్మన్ మంద శ్రీనివాస్ ఉత్సవ కమిటీ సభ్యుల తో కలిసి దేవతలను దర్శించుకున్నరు అనంతరం రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ.... గ్రామంలో కుల, మతాలకతీతంగా గ్రామస్తుల ందరినీ ఒక తాటిపైకి తీసుకువచ్చి గ్రామంలో ఇలాంటి మహోన్నత కార్యక్రమాలు నిర్వహించిన సర్పంచ్ తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు, పలు కుల సంఘ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కాలువలను పెంచకుండా ప్రాజెక్టు నిండుతుందా?

## మంత్రి కొప్పుల ఈశ్వర్ ను ప్రశ్నించిన మహంకాళి రాజన్న



జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు): రోళ్ళవాగు ప్రాజెక్టు విస్తరణను పెంచడము మంచిదేనని నీరు వచ్చే కాలువలను విస్తరించకుండా ప్రాజెక్టును ఎలా నింపుతారో చెప్పాలని టిడిపి జగిత్యాల ఇంచార్జ్ మహంకాళి రాజన్న మంత్రి ఈశ్వర్ ను ప్రశ్నించారు. బుధవారం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో మహంకాళి రాజన్న ప్రకటన విడుదల చేశారు. రోళ్ళవాగు ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం ఒక్కసారిగా పెరిగిందని ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. రోల్లవాగు స్టోరేజ్ కెపాసిటీని ఒక టీఎంసీకి పెంచడం మంచిదే అన్నారు. కానీ ఈ ప్రాజెక్టు పావు టీఎంసీ నీటి నిల్వ ఉన్న సమయంలో నీరు నిండేందుకు తవ్విన కాలువల కెపాసిటీ 150 క్యూసెక్కుల సామర్థ్యం అని చెప్పారు అలాగే నీరు బయటకు పోయేందుకు ఉన్న కాలువ కెపాసిటీ కూడా 150 క్యూసెక్కులని చెప్పారు. ఇంత చిన్నటి కాలువలతో ఒక టీఎంసీ నీటిని ఎంత కాలానికి నింపుతారో చెప్పాలని రాజన్న ప్రశ్నించారు. అలాగే మీరు పేర్కొన్నట్లు 20 వేల ఎకరాలకు నిరందించడం సాధ్యమా అని రాజన్న ప్రశ్నించారు. వీటికితోడు కాంట్రాక్టర్కు బిల్లుల బకాయితో పనులు పురోగతిలో ఉంటాయో చెప్పాలన్నారు. ప్రతిపక్ష నాయకుల మాటలను ప్రభుత్వ తప్పులను సరిద్దిద్దుకోవడానికే తీసుకోవాలే తప్ప ఎదురుదాడి సరికాదని మహంకాళి రాజన్న మంత్రి కొప్పుల ఈశ్వర్ కు సూచించారు. ఆయన వెంట రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు ఓరుగంటి భార్గవ్ రాం, న్యాయవాది విజయ్ కుమార్ నాయకులు బత్తుల కొండయ్య, నక్క లక్ష్మణ్, సాన రాములు ఉన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన కొమ్మూరి ప్రతాప్ రెడ్డి



జనగామ జూన్ 14 (ప్రజామంటలు): జనగామ బృందావన్ గార్డెన్స్ లో జనగామ మండలం శామీర్ పేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గద్ద నర్సియ్య కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులను పీసీసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా నాయకులు జిల్లెల్ల సిద్దారెడ్డి, యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షులు బనుక శివరాజ్ యాదవ్, 16వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ గాదేపాకు రామచందర్, జనగామ పట్టణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మోటే శ్రీనివాస్ ఆలేటి సిద్దిరాములు బోట్ల నర్సింగరావు జనగామ మండల నాయకులు లింగాల నర్సిరెడ్డి శారకొండ రాంరెడ్డి, పిట్టల సతీష్, ఆకుల లక్ష్మయ్య, జాయ మల్లేష్, యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి క్రాంతి, యండి అర్షద్, గందమల్ల కమలాకర్, బిర్రు సత్యనారాయణ, జంపన్న, మోటే మల్లేష్, కోడం నర్సింహులు, ఎనగందుల కృష్ణ, బొల్లం రాజు, పిడుగు రమేష్, బక్క ప్రవర్దన్, గాజుల రాజు, శివరాత్రి పరుశురాములు పాల్గొన్నారు.

# రాజేశ్వరి పుట్టినరోజు భర్త కొత్తకొండ గంగాధర్ నేత్రాల అంగీకార పత్రం



జనగామ జూన్ 14 (ప్రజామంటలు): జనగామ జిల్లా లింగాల ఘనపూర్ మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన కొత్తకొండ గంగాధర్ భార్య రాజేశ్వరి పుట్టిన రోజును పురస్కరించి తాను చనిపోయాక రెండు కళ్ళను ఎవరికైనా దానము చేసి నేను లేకున్నా కానీ నా కళ్ళు ప్రపంచని చుస్తాయని తెలుపుతూ అని తన భార్యపై ప్రేమను చూపెట్టారు. ఈ కార్యక్రమము లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320ఎఫ్ రీజియన్ చైర్మెన్ లయన్ డాక్టర్ గంగి శెట్టి ప్రమోద్ కుమార్ కి అంగీకార పత్రము సమర్పించారు. ఈ సందర్బంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజ్ మాట్లాడారు. ఈ కార్యక్రమములో కాటం కుమారస్వామి, ఉప్పల మధు, పండుగ నరేష్ పాల్గొన్నారు.


# వెంకిర్యాలలో సామూహిక అక్షరాభ్యాసం



జనగామ జూన్ 14 (ప్రజామంటలు): జనగామ జిల్లా వెంకిర్యాల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దూడల రమేష్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ కీర్తి లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దూడల రమేష్, విద్యా కమిటీ చైర్మన్ తాళ్లపల్లి అశోక్ గౌడ్, ఉపాధ్యాయులు ఎన్. లలిత, బి.విద్యా రాణి, అంగన్వాడీ టీచర్లు సీహెచ్. జగదాంబ, ఆర్. స్వరూప ఆయాలు ఏలేంద్ర, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



**జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలా షాపూర్ గ్రామానికి చెందిన శాగ భాస్కర్ కుమారుడు సుశాంత్ నిట్ ఎగ్జామ్ లో 93 % మార్కులతో అల్ ఇండియా ర్యాంక్ సాధించి ఎస్.సి. కేటగిరీలో 6964 తో ఎం.బి.బి.ఎస్. సీట్ సంపాదించగా అభినందనలు తెలిపిన తెలంగాణ ఎస్సి, ఎస్టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాగ కైలాసం.**



**బడుగు, బలహీన వర్గాల ఉన్నతికై నిరంతరం కృషి చేస్తున్న, ఉమ్మడి కరీంనగర్ జిల్లా "మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ రాజేందర్" ఇటీవల బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియామకమైన శుభ సందర్భంలో ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపిన బిసి యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తుమ్మనపెల్లి రాజేంద్ర ప్రసాద్**

# రానున్న ఎన్నికలు, నిర్వహణపై సన్నాహక సమావేశం

## జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



జనగామ జూన్ 14 (ప్రజామంటలు): ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, డిజిపి అంజనికుమార్ రెడ్డిని యాదవ్ తో కలిసి హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఓటరు జాబితా, పోలింగ్ బూతుల లో మౌలిక వసతుల కల్పన ఏర్పాట్ల పై వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష సమావేశం బుధవారం నిర్వహిస్తున్నారు. జిల్లా నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొంటున్న జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య, డిసిపి సీతారాం, అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, రోహిత్ సింగ్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు చేసిన, చేయాల్సిన సౌకర్యాల గురించి సమీక్ష సమావేశం నిర్వహిస్తూ జిల్లాలో పోలింగ్ బూత్ లలో సౌకర్యాలు ఎన్నికల నిర్వహణ ఎంత మంది సిబ్బంది అవసరం ఉన్నారో, వాహనాల వివరాలు తెలపాలని సామాజిక మాధ్యమాలు, సోషల్ మీడియా మానిటరింగ్ కమిటీ, 18 సంవత్సరాలు పైబడిన ఓటరుల వివరాలు, నియోజకవర్గాల వారీగా ఓటరు జాబితా వివరాలు పూర్తి సమాచారంతో ఈనెల 23న నిర్వహించే కలెక్టర్లు, ఎస్పీల సమావేశం కు రావాల్సిందిగా సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య సంబంధిత విభాగాల అధికారులతో మాట్లాడుతూ.... జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం ఎలా ముందుకు వెళ్లాలో పూర్తి వివరాలతో కూడిన అన్ని శాఖల (ప్రణాళిక) నివేదిక సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో డిసిపి సీతారాం,అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, రోహిత్ సింగ్, ముఖ్య ప్రణాళిక అధికారి ఇస్మాయిల్, తాహసిల్దారులు అన్వర్, రవీందర్, పరిపాల అధికారి ఏకె.మన్సూరి, ఎన్ఐసి రాం ప్రసాద్, ఈడిఎం దుర్గా రావు, డిటి శంకర్ ఉన్నారు.

# ఉస్మానియా వైద్య కళాశాలలో హెల్త్ క్యాంపు

## ఘనంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు



సికింద్రాబాద్ జూన్ 14 (ప్రజామంటలు): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉస్మానియా వైద్య కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆరోగ్య శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ రెడ్డి ప్రారంభించారు. తెలంగాణ వచ్చిన గత 10 ఏళ్లలో వైద్యానికి రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు ఆధ్వర్యంలో ఆసుపత్రులు ఆధునీకరణ, కొత్త వైద్య కళాశాల ఏర్పాటుకు ఎంతో కృషి చేశారని అన్నారు. ఆస్పత్రి ఆధునికరించి అన్ని రకాల చికిత్స పరికరాలను ఏర్పాటు చేసి రోగులకు సౌకర్యంతమైన చికిత్సలు అందచేయడం జరిగిందని ఆమె అన్నారు. ఈ సందర్భంగా ఓఎంసి కేర్స్, రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసిన విద్యార్థులను అభినందించారు. ఈ హెల్త్ క్యాంపును శానిటేషన్ తో పాటు సెక్యూరిటీ సిబ్బంది వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ జయ, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్ ఓ డి డాక్టర్ కెంచె భవాని, ప్రొఫెసర్ డాక్టర్ పద్మావతి, సుమలత, ఎంపి హెచ్ఓ వేణుగోపాల్ గౌడ్, వైద్య విద్యార్థులు, డాక్టర్లు పాల్గొన్నారు.

# ఈటలను సీఎం అభ్యర్థిగా బీజేపీ ప్రకటించాలి

## పొట్లకాయల డిమాండ్



సికింద్రాబాద్ జూన్ 14 (ప్రజా మంటలు): బీసీల బిడ్డ , బలహీన వర్గాల ఆశాజ్యోతి ఈటల రాజేందర్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి అభ్యర్థి గా బీజేపీ ప్రకటించాలని ఆలిండియా ముదిరాజ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, తెలంగాణ ఉద్యమ నాయకుడు పొట్లకాయల వెంకటేశ్వర్లు కోరారు. రాష్ట్ర రాజకీయాల్లో మచ్చలేని నాయకుడిగా, పేదలకు అండగా ఉంటూ, మలిదశ ఉద్యమపోరులో అలుపెరగని పోరాటం చేసి, తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన ఈటల రాజేందర్ ను బీజేపీ సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తే, అది బడుగు, బలహీనవర్గాల ప్రజల్లో గొప్ప ధీమా కలుగుతుందన్నారు. బీసీని ముఖ్యమంత్రి అభ్యర్తిగా ప్రకటిస్తే, రాష్ట్ర రాజకీయంలో పెనుమార్పులు వస్తాయన్నారు. పార్టీలకతీతంగా ఈటల రాజేందర్ ను బలపరచడానికి ప్రతి ఒక్కరు ముందుకు వస్తారని పేర్కొన్నారు. నిరంకుశ, అవినీతి నాయకుడు కేసీఆర్ ను కాదని, తన మంత్రి పదవిని తృణపాయంగా వదిలిన గొప్ప నేత ఈటల రాజేందర్ అని పొట్లకాయల కొనియాడారు.

# జిల్లా కేంద్రంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాన దినోత్సవం

## పాల్గొన్న ఎమ్మెల్యే డా. సంజయ్, జడ్పీ చైరపర్సన్ వసంత



జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆపి-రోటరీ క్లబ్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి మంచాల కృష్ణ, సభ్యుడు సిరిసిల్ల శ్రీనివాస్ ల నిర్వహణలో బుధవారం ప్రపంచ రక్తదాన దినోత్సవం కార్యక్రమం జరిగింది. పట్టణంలోని వాసవి గార్డెన్లో నిర్వహించిన రక్తదాన శిబిరం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొని ప్రారంభించగా , జెడ్పి చైర్ పర్సన్ వసంత సురేష్ , వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, జిల్లా సంక్షేమశాఖ అధికారి డా.బోనగిరి నరేష్, జిల్లా అటవీ శాఖ అధికారి బి. వేంకటేశ్వర రావు, కోరుట్ల రవాణా శాఖ అధికారి చాడ రంజిత్ రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఏవిఎల్ఎన్ చారి, రాజుతో పాటు పలువురు రక్తదాతలు పాల్గొన్నారు. బ్లడ్ బ్యాంక్ వైద అధికారి డా. రవి, ఆర్గనైజర్ కొమురవెల్లి వేణుగోపాల్, మరియు సిబ్బంది, పలువురు రక్తదాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 67వ సారి రక్తదానం చేసిన కనపర్తి రవితో పాటుగా కోరుట్ల రవాణా శాఖ అధికారి చాడ రంజిత్ రెడ్డిని, అధిక సంఖ్యలో క్యాంపుల నిర్వహణ, రక్తదానం చేసిన పలువురు రక్తదాతలతో పాటు మొదటిసారి రక్తదానం చేయడానికి ముందుకొచ్చిన శ్యాం తదితరులను ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ.... యువత రక్తదానం చేయడంలో ముందుకు రావాలని, ప్రాణదాతలుగా నిలవాలన్నారు.

# ఎపి బిసిలకు జగన్ తీవ్ర అన్యాయం

## రాజ్యసభ కూడా తెలంగాణ బిసిలకు ఇచ్చారు

## మండిపడ్డ మాజీమంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి,జూన్14 : బీసీలహక్కులు, స్వేచ్ఛను కాపాడేందుకు, ప్రతి బీసీకి జగన్ చేసిన మోసాన్ని తెలియచేసేందుకే బీసీ భరోసాబాట కార్యక్రమం చేపట్టామని మాజీమంత్రి కొల్లురవీంద్ర అన్నారు. జగన్ తలకిందులుగా తపస్సుచేసినా టీడీపీ బీసీ భరోసాబాటను అడ్డుకోలేడన్నారు. ఏపీలో బీసీనేతలే లేరన్నట్టు, తనకు ఊడిగంచేసే తెలంగాణ నేతలకు జగన్ రాజ్యసభ పదవి ఇచ్చాడని విమర్శించారు. పదవుల్ని ఎరగావేసి, పొరుగురాష్ట్ర బీసీనేతలతో ప్రచారంచేయించి, ఏపీ బీసీల్లో విషబీజాలు నాటి, వారి ఓట్లతో ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. 4 ఏళ్లలో బీసీలకు తప్పుడుకేసులు, ఆస్తుల ధ్వంసం, హత్యలు, అవమానాలు, వేధింపుల్ని కానుకగా ఇచ్చాడని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డిని కోర్టులు తప్పుపడుతున్న, ఆయన కోర్టుల్ని ధిక్కరిస్తున్నా న్యాయమూర్తిగా పనిచేసిన ఈశ్వరయ్య ఎందుకు మౌనంగా ఉన్నాడు? అని ప్రశ్నించారు. సిగ్గులేకుండా పదవులకోసం కక్కుర్తిపడిన ఈశ్వరయ్యలాంటి వాళ్లు, జగన్ను సమర్థించి రాష్ట్రంలోని బీసీలకు తీరని ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి పంచనచేరి, బలహీన వర్గాలకు తీరనిద్రోహం చేస్తున్న ఈశ్వరయ్య లాంటివాళ్లను రాష్ట్రంలో తిరగనివ్వమని హెచ్చరించారు. బీసీల్నిభయపెట్టి, తనబానిసలుగా మార్చాలనుకుంటున్న జగన్మోహన్ రెడ్డి ఆటలు సాగనివ్వమన్నారు.

# కంట తడి పెట్టిన మంత్రి ఈశ్వర్

: రామ కిష్టయ్య సంగన భట్ల



తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలలో భాగంగా బుధవారం ధర్మపురి నియోజక వర్గ కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య దినోత్సవ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ కంట తడి పెట్టిన సంఘటన చోటు చేసుకుంది. ఆరోగ్య పరంగా ప్రభుత్వ పరంగా వివిధ పరిస్తితులలో ప్రయోజనం పొందిన లబ్ధిదారులు తమ అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా ధర్మారం మండలం దొంగతుర్తికి చెందిన గొట్టే లక్ష్మీనారాయణ, లక్ష్మి దంపతులు తమ కూతురు అక్షయతో కలిసి వేదిక పైకి వెళ్లారు. లక్ష్మీ నారాయణ మైకును తీసుకుని తన కూతురు అక్షయ హృదయ విదారక పరిస్థితిని కళ్ళకు కట్టినట్లు వివరించారు. 2021లో అక్షయ అనారోగ్యానికి గురి కాగా, వైద్యుల సూచన మేరకు బసవ తారకం ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు నిర్వహింప చేయగా, బ్లడ్ క్యాన్సర్ అని తేలిందని, తమకు దిక్కు తోచక మంత్రి కొప్పుల ఈశ్వర్ ఇంటికి వెళ్ళి తమకు వచ్చిన కష్టాన్ని, తమ బీద స్థితిని వివరించామన్నారు. వెంటనే మంత్రి ఈశ్వర్ స్పందించి తామున్నామని వెన్ను తట్టి ధైర్యము చెప్పి, ఆసుపత్రికి ఫోన్ చేసి తమకు ఒక్క పైసా ఖర్చు లేకుండా చికిత్స చేయించారని, తమకు దేవుడు ఎవరో తెలియదని, ప్రత్యక్ష దైవం ఈశ్వర్ మాత్రమే నని, తమ పాప జీవించి ఉందంటే ఈ దేవుని కృప వల్లే అని కన్నీరు మున్నీరు గా వివరించిన తీరు మంత్రి కొప్పుల ఈశ్వర్ కు కంట తడి పెట్టించింది. సభలో ఒక్కసారి నిశ్చబ్దం ఆవహించింది. వెంటనే మంత్రి ఈశ్వర్ వారిని దగ్గరకు తీసుకుని ఓదార్చి మానవత్వాన్ని చాటుకున్నారు.

# ప్రభుత్వ దవాఖానాల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం

## తెలంగాణ వచ్చాక వైద్యరంగం బలోపేతం

## వైద్యారోగ్య దినోత్సవంలో స్పీకర్ పోచారం



కామారెడ్డిజూన్12(ప్రజామంటలు) : ప్రభుత్వ దవాఖానాల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నట్లు సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇందుకోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తోందని అన్నారు. తెలంగాణ వచ్చిన తరవాతనే ఆరోగ్య రంగం బలోపేతం అయ్యిందన్నారు. కొత్తగా ఆస్పత్రుల నిర్మాణంతో పాటు ఉన్న ఆస్పత్రుల్లో సౌకర్యాలు మెరుగు పరస్తూ వస్తున్నామని అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బాన్సువాడ పట్టణంలోని మీనా గార్డెన్స్‌లో వైద్యారోగ్య దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో స్పీకర్ ముఖ్య అతిథిగా హాజరగా.. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, డీఆర్వో రాజారెడ్డి, బాన్సువాడ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రం సాధించిన ప్రగతి, వాటి ప్రయోజనాలను ప్రజలకు వివరించేం దుకు దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏటా ప్రైవేటు ఆసుప్రతుల సంఖ్య పెరుగుతుందని, ఆసుపత్రులు పెరిగాయంటే పేషెంట్లు పెరుగుతున్నారని అర్థమన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం ఖరీదైన వ్యవహారమన్నారు. పేదలు ఆర్థికంగా భరించలేమని, రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రులను విస్తరించి.. అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చి పేదలకు వైద్య సహాయం అందజేస్తుందన్నారు. రాష్ట్ర బ్జడెట్‌లో వైద్యారోగ్యశాఖకు రూ.11వేలకోట్లు కేటాయించారన్నారు. నిమ్స్ ఆసుపత్రిలో ఇప్పటికే 2వేల పడకల కెపాసిటీ ఉండగా.. మరో 2వేల పడకలను పెంచేందుకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారన్నారు. పట్టణ ప్రాంతాల్లో బస్తీ దవాఖానాల్లో ఏర్పాటు చేశామని, ఇంత పెద్ద ఎత్తున నిధుల కేటాయింపు దేశంలో మరే రాష్ట్రంలో లేదన్నారు. వరంగల్‌లో 2వేల పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంలో ఉన్నదన్నారు. గతంలో రాష్ట్రంలో 3డయాలసిస్ కేంద్రాలు ఉంటే నేడు 26 పెరిగాయన్నారు.బాన్సువాడలో రూ.20కోట్లతో వంద పడకల మాతాశిశు ఆసుప్రతిని నిర్మించామని, రెండేళ్లలోనే ఆసుపత్రికి జాతీయ అవార్డు వచ్చిందన్నారు. వైద్యులు, సిబ్బంది కృషే అవార్డుకు కారమన్నారు. బాన్సువాడ ఆసుపత్రికి జుక్కల్, ఎల్లారెడ్డి, బోధన్, నారాయణఖేడ్ నియోజకవర్గాలతో పాటుగా మహారాష్ట్ర నుంచి సైతం జనం ఆసుపత్రికి వస్తున్నారన్నారు. బాన్సువాడ పట్టణంలో రెండు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. వర్నిలో రూ. 10.70కోట్లతో నిర్మించే 30 పడకల ఆసుపత్రికి, కోటగిరిలో రూ.13 కోట్లతో 50 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పేదలకు వైద్య సేవలు ఇంకా విస్తరించాలన్నారు.

# ప్రభుత్వ చర్యలతో ప్రజారోగ్యం బలోపేతం

## ఆస్పత్రులు, కాలేజీల నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ

## వైద్యారోగ్య దినోత్సవంలో మంత్రి జగదీశ్ రెడ్డి



హైదరాబాద్,జూన్12(ప్రజామంటలు) : ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యల వల్ల తెలంగాణలో వైద్యరంగం గణనీయంగా అభివృద్ధి సాధించిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి వెల్లడించారు. ఎప్పుడూ లేనంతగా ఆస్పత్రుల నిర్మాణం, కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు జరిగిందన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నల్లగొండ పట్టణంలో వైద్య ఆరోగ్య దినోత్సవంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ రంగాల్లోముందుకు పోతుందని వెల్లడించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది నియామకంతో పాటు నూతన పరికరాలు, అధునాతన వైద్య యంత్రాల ఏర్పాటు, భవనాల నిర్మాణాలు, కళాశాలలు, వైద్య శాలలను ప్రభుత్వం కొత్తగా నెలకొల్పిందని అన్నారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రులో నేడు ఓపీలు, ఆపరేషన్లుపెరిగాయని పేర్కొన్నారు. ఏరియా ఆసుపత్రుల్లోనే డయాలసిస్ కేంద్రాలను నెలకొల్పి వైద్యాన్ని అందిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో మాతృ, శిశు మరణాల సంఖ్య తగ్గిందన్నారు. లక్ష మందిలో 97 మాతృ మరణాలు ఉంటే నేడు 39కి తగ్గిందని పేర్కొన్నారు.ప్రతి వెయ్యి మంది పిల్లల్లో 39 మరణిస్తే నేడు 27కి తగ్గిందని వివరించారు. 2014లో ప్రభుత్వాసుపత్రుల్లో 31శాతం, ప్రైవేట్ లో 69 శాతం నార్మల్ డెలివరీలుండగా నేడు ప్రభుత్వాసుపత్రుల్లో 58 శాతం పైగా నార్మల్ డెలివరీలు అవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం నాటికి రాష్ట్రంలో 2500 మెడికల్ సీట్లు ఉంటే.. నేడు ఆ సంఖ్య 25వేలకు పెరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, డీఎంహెచ్‌వో కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ విక్రయిస్తూ పట్టుబడ్డ నిర్మాత కెవిపి చౌదరి

## నైజీరియన్ పారిపోగా..పట్టుబడ్డ తెలుగు నిర్మాత



హైదరాబాద్,జూన్12(ప్రజామంటలు) :కబాలి చిత్ర నిర్మాత కేపీ చౌదరిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. కేపీ చౌదరి నుంచి భారీగా కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. గత రాత్రి కొకైన్ విక్రయిస్తుండగా అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేపీ చౌదరి నుంచి 82.75 గ్రాముల కొకైన్, రూ. 2.05 లక్షల నగదు, నాలుగు మొబైల్స్, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఖమ్మం జిల్లా బోనకల్లుకు చెందిన కేపీ చౌదరి బీటెక్ చదివి, పలు ప్రాంతాల్లో ఉద్యోగాలు చేశారు. 2016లో సినిమా రంగంలోకి వచ్చారు. కబాలి సినిమాకు తెలుగు నిర్మాతగా వ్యవహరించారు. పలు తెలుగు, తమిళ సినిమాలకు డిస్ట్రిబ్యూటర్‌గా పని చేశారు. సర్దార్ గబ్బర్ సింగ్, అర్జున్ సురవరం, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలకు డిస్ట్రిబ్యూటర్‌గా వ్యవహరించారు. అయితే సినీరంగంలో నష్టాలు రావడంతో.. డ్రగ్స్ బిజినెస్‌లోకి దిగారు. గోవాలో ఓహెచ్ఎం పబ్‌ను ప్రారంభించారు. సెలబ్రెటీలకు గోవాలో డ్రగ్స్ సరఫరా చేశారు. పబ్‌లో నష్టాలు రావడంతో హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. గోవా నుంచి వస్తూ 100 ప్యాకెట్ల కొకైన్ తీసుకొచ్చారు. గోవా నుంచి తెచ్చిన వాటిలో కొన్నింటిని వినియోగించారు. మిగిలిన వాటిని మంగళవారం రాత్రి కిస్మత్‌పూర్ వద్ద విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కేపీ చౌదరి వెంట ఉన్న నైజీరియన్ పరారీ అయ్యాడు. పరారీలో ఉన్న నైజీరియన్‌పై గతంలో రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది అని పోలీసులు తెలిపారు.

# నెల్లూరులో కొనసాగుతున్న లోకేశ్ పాదయాత్ర

## రైతులకు మేలు చేయడంలో అనిల్, కాకాణి విఫలం

## నాయుడుపల్లెలో రైతులతో లోకేశ్ ముఖాముఖి

నెల్లూరు,జూన్14 : టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర జిల్లాలో కొనసాగుతోంది. కడప జిల్లా పర్యటన ముగిసిన అనంతరం నెల్లూరులో యాత్ర ప్రవేశించింది. నాయుడుపల్లెలో రైతులతో లోకేశ్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా యువనేత మాట్లాడుతూ... టీడీపీ హయాంలోనే ప్రభుత్వం రైతులకు అండగా నిలబడిందన్నారు. అనిల్ ఇరిగేషన్ మంత్రిగా జిల్లాలో ఒక్క ప్రాజెక్ట్ కూడా పూర్తిచేయలేదని... వ్యవసాయ శాఖ మంత్రిగా కాకాణి కూడా విఫలమయ్యారని విమర్శలు గుప్పించారు. కాకాణి కోర్టులో చోరీ కేసు, సీబీఐ ఎంక్వయిరీలో బిజీగా ఉన్నారని యెద్దేవా చేశారు. ప్రకృతి వైపరీత్యాల్లో ప్రత్యక్షంగా పాల్గొనలేదని... ఒక్క సమస్య పరిష్కారించ లేదని మండిపడ్డారు.

చంద్రబాబుహయాంలో ఏర్పాటు అయిన వ్యవసాయ పరిశోధన కేంద్రాలు, ప్రస్తుత ప్రభుత్వం కరెంటు బిల్లులు కట్టలేక మూతపడ్డాయన్నారు. హార్టికల్చర్‌ను నెంబర్ వన్‌గా చేస్తామని... రాయలసీమలో ఓ రైతు ఎకరా భూమిలో రూ.కోటి సంపాదించారని తెలిపారు. నకిలీ విత్తనాల సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఓ ఎంపీ నకిలీ విత్తనాలు సరఫరా చేసి జేబులు నింపుకున్నారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక నకిలీ విత్తనాలని అరికడతామన్నారు. అవసరమైతే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయిస్తామని తెలిపారు. టీడీపీ అధికారంలో వచ్చాక గతంలో రైతుల కోసం అమలు చేసిన ఇన్‌పుట్ సబ్సీడీలన్నీ అమలు చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.

# ముగిసిన భాటి అంత్యక్రియలు

## హాజరైన డిజిపి అంజనీకుమార్ తదితరులు

హైదరాబాద్,జూన్12(ప్రజామంటలు) : దేశంలోనే అత్యుత్తమ విభాగంగా గ్రేహౌండ్స్‌ను తీర్చిదిద్దిన ఎంఎస్ భాటి అంత్యక్రియలు ముగిసాయి. ఈ కార్యక్రమానికి డీజీపీ అంజనీ కుమార్‌తో సహా పలువురు సీనియర్ పోలీస్ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. దాదాపు మూడు దశాబ్దాలుగా గ్రేహౌండ్స్ వ్యవస్థాపక కమాండెంట్‌గా విశేష సేవలందిందించిన పద్మశ్రీ భాటి మంగళవారం దివంగతులయ్యారు. బుధవారం ఉదయం మహాప్రస్థానంలో జరిగిన వారి అంత్యక్రియలు పూర్తి అయ్యాయి. డీజీపీ అంజనీ కుమార్, మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, ఏపీ మాజీ డీజీపీ గౌతమ్ సావంగ్‌తోపాటు పలువురు అధికారులు హాజరై నివాళులు అర్పించారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

## ప్రభుత్వ దవాఖానాల పటిష్టం

## ఆరోగ్య దినోత్సవంలో మంత్రి ఇంద్రకరణ్

హైదరాబాద్,జూన్12(ప్రజామంటలు) :

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో సర్కారు దవాఖానలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నామని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ఇప్పటికే గ్రామీణం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ హాస్పిటల్లను ప్రభుత్వం అభివృద్ధి చేసిందని తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్మల్‌లోని ఎంసీహెచ్‌లో నిర్వహించిన ఆరోగ్య దినోత్సవంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా డాక్టర్లు, ఆశా వర్కర్లు, వైద్య బృందాలు, ప్రొఫెసర్లకు తెలిపారు. అనంతరం దవాఖానలో బాలింతలకు కేసీఆర్ కిట్లను అందజేశారు. రూ.23.75 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన నిర్మల్ జిల్లా.. వైద్య రంగంలో గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తేవడంతో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలను కూడా ఉచితంగా అందజేస్తున్నామని వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్‌ను 80 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు. జిల్లా ఆసుపత్రితోపాటు ఇతర దవాఖానాల్లో మొత్తం 450 పడకలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు.

# యాదాద్రికి గ్రీన్ యాపిల్ అవార్డు

## ఆనందం వ్యక్తం చేసిన మంత్రి ఇంద్రకరణ్

హైదరాబాద్,జూన్12(ప్రజామంటలు) :

తెలంగాణ ప్రజల ఇలవేల్పు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయానికి లండన్‌లోని గ్రీన్ ఆర్గనైజేషన్ ప్రతిష్ఠాత్మక గ్రీన్ యాపిల్ అవార్డు లభించింది. ఈ అవార్డు రావడం పట్ల దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అద్భుతమైన మతపరమైన నిర్మాణాల విభాగంలో యాదాద్రి ఆలయానికి గ్రీన్ యాపిల్ అవార్డు రావడం తెలంగాణ రాష్ట్రానికి దక్కిన అపూర్వ గౌరవమని మంత్రి తెలిపారు. స్వయం పాలనలో తెలంగాణకు ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు దక్కడం మనందరికి గర్వకారణమని పేర్కొన్నారు. స్వయంభువుగా వెలిసిన 13వ శతాబ్దంనాటి స్వామివారి విగ్రహానికి ఎటువంటి నష్టం జరగకుండా, ప్రధాన ఆలయంలోకి సహజ సిద్ధంగా గాలి, వెలుతురు వచ్చే విధంగా, ఆలయ పరిసరాల్లో 40 శాతం గ్రీనరీతో విద్యుత్తు వినియోగాన్ని సాధ్యమైనంత మేరకు తగ్గించేలా ఈ ఆలయాన్ని అద్భుతంగా నిర్మించడంతో అంతర్జాతీయ అవార్డు లభించినట్లు మంత్రి వెల్లడించారు. సీఎం కేసిఆర్ మార్గ నిర్ధేశరలో ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికి ఈ సందర్భంగా మంత్రి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# బాలికల కళాశాల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు): జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్డు బైపాస్ చౌరస్తా సమీపం లో గల షెడ్యూల్డ్ కులాల ప్రభుత్వ బాలికల కళాశాల వసతిగృహం -1 లో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కే రాజకుమార్ ఆదేశాల మేరకు అర్హులైన బాలికలు అడ్మిషన్లు పొందుటకు దరఖాస్తు చేసుకోవాలని వసతి గృహ సంక్షేమ అధికారిణి శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వసతి గృహంలో 55 ఖాళీలకు గాను ఎస్సీలకు 50, ఎస్టీలకు 5 సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. అర్హులైన వారు వసతి గృహంలో నేరుగా సంప్రదించాలని లేదా మొబైల్ నెంబర్ 9014870770 కు సంప్రదించాలని సూచించారు.

# నిజమైన లబ్దిదారుల ఎంపికలో వెల్ఫేర్ కమిటీలకు భాగస్వామ్యం కల్పించాలి



జనగామ జూన్ 14 (ప్రజామంటలు): జనగామ జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే కుల వృత్తుల ఇచ్చే లక్ష రూపాయల ఆర్థిక సహాయ పథకంపై బుధవారం చర్చ గోష్టి నిర్వహించారు. పథకం సంబంధించిన నిజమైన లబ్దిదారుల ఎంపికలో వెల్ఫేర్ కమిటీలకు భాగస్వామ్యం కల్పించాలని, కుల సంఘాల వారికి కూడా తగిన గౌరవం ఇచ్చేలా చూడాలని, చివరి గడువు తేదిని పొడిగించాలని, కులం ఆదాయం సర్టిఫికేట్ జారీ చేయుట ఆలస్యం కాకుండా త్వరితగతిన ఇచ్చేలా చూడాలని కోరుతూ జిల్లా కమిటీ ఆద్వర్యంలో బిసి వెల్ఫేర్ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు జిల్లెల్ల గణేష్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అభినాష్, జిల్లా నాయకులు వీరాస్వామి, అంజయ్య, రాజు, ఆనంద్, మండల నాయకులు బలరాం, కనకయ్య,శివ, శ్రీనివాస్, బాలరాజు, పవన్, అనిల్ పాల్గొన్నారు.

# కీడాకారులకు క్రికెట్ కిట్స్ పంపిణీ



నర్మెట్ట జూన్ 14 (ప్రజామంటలు): భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ధారవత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో మండలం లోని హన్మంతపూర్ మరియు డీసీ తండా గ్రామంలో యువతకు భారతీయ జనతా పార్టీ జనగాం జిల్లా ఉపాధ్యక్షులు బేజాడి బీరప్ప, బేజాడి ట్రస్ట్ ద్వారా క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందించారు. తదనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి బీరప్ప మాట్లాడుతూ.... ఈ రోజుల్లో విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో క్రీడల్లో యువత రాణించినప్పుడే దేశం ముందుకు వెళుతుందని అన్నారు. క్రీడలు యువతకు శారీరకంగా మరియు మానసికంగా ఎంతగానో దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ బల్ల శ్రీనివాస్, కిషన్ మోర్చా మండల అధ్యక్షులు జంగిటి నాగేశ్వర్, సిద్దిపేట్ యువ మోర్చా ప్రధాన కార్యదర్శి మనోజ్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు సాయినాథ్, సురేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఇట్టబోయిన రాజు, కొర్ర నరేష్, క్రాంతి యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పట్టణ ప్రగతి దినోత్సవము" నిర్వహణపై సమీక్ష



జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు): నేడు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగముగా నిర్వహించు "తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవము" నిర్వహణపై బుధవారం సమీక్ష నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ డా. బి. నరేష్. ఈ సందర్భముగా మాట్లాడుతూ.... జగిత్యాల జిల్లాలో అతిపెద్ద మున్సిపాలిటీ అయిన మన జగిత్యాల మున్సిపాలిటీ తరుపున ఘనంగా తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవము నిర్వహించాలని, ఇట్టి దినోత్సవము తెలంగాణ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులు వివరించాలని, రంగోలి కార్యక్రమము, ర్యాలీ, మానవ హారము, కార్మికులకు దుస్తుల పంపిణీ మొదలగు కార్యక్రమములు నిర్వహించాలని, తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవము విజయవంతం చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేసినారు. ఈ సమీక్ష సమావేశంలో డి.ఈ. రాజేశ్వర్, మేనేజర్ ప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ బలయెళ్ళం, టి.పి.ఒ. శ్రీనివాస్, జే.ఎ.ఒ. గణేష్ మరియు కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

# మాతా శిశులో రోగులకు పండ్లు పంపిణీ



జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నేడు వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మాతా శిశు లో రోగులకు పండ్లు పంపిణీ చేసిన స్థానిక శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్ హరిచరన్ రావు,స్థానిక కౌన్సిలర్ జంబర్థి రాజ్ కుమార్, జెడ్పీటీసీ మహేష్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ శివ రామ్ ప్రసాద్, సుపెరిండెంట్ రాములు, అర్బన్ మండల యూత్ అధ్యక్షులు శేఖర్, నాయకులు కూతురు శేఖర్, జిల్లా బిసి సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి వంశీ బాబు పాల్గొన్నారు.

# దేశానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య రంగం

## ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలోని విరూపాక్షి గార్డెన్స్ లో జరిగిన వైద్య ఆరోగ్య దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, కలెక్టర్ యాస్మిన్ భాషా. తెలంగాణ ప్రభుత్వం తరుపున గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ప్రతిభ కనబరిచిన వైద్య శాఖ సిబ్బందిని మెమంటో ఇచ్చి సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... మహిళా,శిశు సంరక్షణకు, మహిళల రక్షణకు మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మహిళల అభ్యున్నతి కోసం గత 9 ఏండ్లలో దేశంలోనే ఎక్కడాలేని విధంగా అనేక సంక్షేమ పథకాలు, విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వం.

### తెలంగాణ ప్రభుత్వం వైద్యారోగ్య రంగంలో చేపట్టిన కార్యక్రమాలు:

రూ. 2000 వేల కోట్లతో నిమ్స్ విస్తరణ అలాగే మరో 2000 వేల కోట్లతో వరంగల్ హెల్త్ సిటీ ఏర్పాటు. కంటి వెలుగు, కెసిఆర్ కిట్, అమ్మఒడి వాహనాలు, ఎన్సీడి కిట్, తెలంగాణ డయాగ్నస్టిక్స్, డయాలసిస్ కేంద్రాలు, క్యాథ్ ల్యాబ్ లు, బస్తీ దవాఖానాలు, ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రోగి సహాయకులు భోజనం,టి ఫా స్కానింగ్,టీమ్ బేస్డ్ ఇన్సెంటివ్,డైట్, శానిటేషన్ చార్జీలు డబుల్, టెలి కన్సల్టెన్సీ, టెలి మానస్ సేవలు, ఎక్విప్మెంట్ మెయింటెనెన్స్ పాలసీ, 2023-24 కు రికార్డు స్థాయిలో రూ.13,364 కోట్ల బడ్జెట్ కేటాయింపులు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. చంద్రశేఖర్ గౌడ్, రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హనుమాండ్లు, జెడ్పీటీసీ మనోహర్ రెడ్డి, ఎంపీపీలు రాజేంద్ర ప్రసాద్, కోల జమున శ్రీనివాస్, సంధ్యారాణి సురేందర్, ఆర్డీఓ మాధురి, కౌన్సిలర్లు, ప్రిన్సిపల్ శివరాం ప్రసాద్, సూపరింటెండెంట్ రాములు, వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళా చైర్పర్సన్ స్థానంలో పురుషున్ని ఉంచడమే మహిళా న్యాయమా ?

**మహిళల హక్కులను కాలరాస్తున్న బిఆర్ఎస్ ప్రభుత్వం**
**అధికారిక కార్యక్రమాల్లో కాంగ్రెస్ ను విమర్శించడంపై ఆగ్రహం**
**జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి**



జగిత్యాల,జూన్ 14 (ప్రజామంటలు): కేవలం పెన్షన్లు ఇచ్చి మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గొప్పలు చెప్పుకోవడానికేనా దశాబ్ది ఉత్సవాలు జరుపుతున్నారని మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్, జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవెందర్ రెడ్డి ఆరోపించారు. మహిళల హక్కులను కాలరాయడంతో పాటు రైతులను గోస పెట్టుకుంటున్న బిఆర్ఎస్ ప్రభుత్వానికి మహిళల గురించి మాట్లాడే హక్కు లేదని మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయ లక్ష్మి దేవేందర్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.... రాజ్యాంగంలో అంబేద్కర్ మహిళలకు కల్పించిన హక్కులను తెలంగాణ ప్రభుత్వం కాల రాస్తోందని, బీసీ మహిళకు కేటాయించిన జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ పదవిలో పురుషుని కూర్చోబెట్టి, బీసీ మహిళల స్థానంలో ఓసీ లు రాజ్యం ఏలుతున్నారని, మహిళలకు కేటాయించిన సీట్లలో కుడా మహిళలను ముందుకు రానివ్వడం లేదని ఇందుకేనా ఉత్సవాలని ఆరోపించారు. రాష్ట్ర ప్రథమ పౌరురాలైన గవర్నర్ ను తిట్టిన వారికి ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారని చెబుతూ ఇదేనా మీరు మహిళలకు ఇచ్చే గౌరవం అని ప్రభుత్వ తీరును నిలదీశారు. నూతన సచివాలయంలోకి మీడియాను కూడా అనుమతించక పోవడాన్ని తప్పుబడుతూ సచివాలయం బీఆర్ఎస్ పార్టీ భవనం కాదని,మహిళలకు ఇవ్వాల్సిన పావలా వడ్డీ నాలుగేళ్లుగా ఎందుకు ఇవ్వలేదని, తొమ్మిదేళ్ళ కాలంలో ఏనాడైనా మహిళల సంరక్షణ కోసం సమావేశం ఏర్పాటు చేశారా అని విజయలక్ష్మి ప్రశ్నించారు. అధికారికంగా నిర్వహిస్తున్న దశాబ్ద ఉత్సవాల్లో కాంగ్రెస్ పై విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తూ మీ పార్టీ అఫీస్ లో మాట్లాడండని హితవుపలికారు. పది కోట్ల విలువైన భూములు కేవలం రు.4.80 లక్షలకే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలకు కేటాయించడం సరైందికదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 8 కోట్ల జనాభాకు రు.10కోట్ల మద్యం అమ్మకాలు ఉంటే నేడు 4 కోట్ల మందికి రు.40 వేల కోట్ల ఆదాయం పెరిగిందని దుయ్యాబట్టారు. తెలంగాణ ఏర్పడిన నాడు 12 లక్షల మంది వితంతువులు ఉంటే నేడు 15లక్షల మంది వితంతువులు ఉన్నారని,రాష్ట్ర ఆదాయం కోసం తాగుబోతులను చేస్తున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిలర్ ములస్తపు లలిత, సహారా అజార్, అల్లాల సరిత, చిట్ల లత , బింగి సుమ రవి, సంజన కౌన్సిలర్లు కల్లేపల్లి దుర్గయ్య, నక్క జీవన్, కాంగ్రెస్ నాయకులు గాజుల రాజేందర్, బింగి రవి, ఆశిం సావన్, ముద్దం రాజీరెడ్డి, పాల్గొన్నారు.

# అంబారిపేట్‌లో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ

**ఎమ్మెల్యే, జెడ్పీ చైర్ పర్సన్**



జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు): జగిత్యాల అర్బన్ మండల అంబారిపేట్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసిన జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేష్, సర్పంచ్ గంగాధర్,ఎంపీటీసీ మల్లారెడ్డి,ఉప సర్పంచ్ నారాయణ, అర్బన్ మండల ఆర్‌బిఎస్ కన్వీనర్ జుంబర్తి శంకర్, వెంకటేశ్వర ఆలయ చైర్మెన్ బక్కన్న, రైతు బందు సమితి మెంబర్ దూడ వెంకటేష్, గ్రామశాఖ మల్లేష్, నాయకులు శంకర్, భారతపు నాగరాజు, గంగాధర్, స్వామి రెడ్డి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ కు పద్మశాలి కుల భాంధవుల వినతి పత్రం



జగిత్యాల/ కొడిమ్యాల జూన్ 14 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని అన్ని గ్రామాల పద్మశాలి కుల బాంధవులు జిల్లా అధ్యక్షులు రుద్ర శ్రీనివాస్ పిలుపుమేరకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన బీసీ కులాలకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం ఇచ్చి వాటిలో పద్మశాలీలకు గుర్తింపు లేనందున కలెక్టర్ కి వినతి పత్రం అందించడానికి కొడిమ్యాల పట్టణ మరియు పరిసర గ్రామాల కుల సభ్యులు వెళ్లడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల బిసిలకు లోన్లను ఇస్తామని ప్రకటించింది. అయితే అందులో పద్మశాలి వర్గాన్ని చేర్చకపోవడం అన్యాయంగా భావిస్తున్నాం. ఓటు బ్యాంకుగా మాత్రమే పద్మశాలీలు పనికి వస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం, పద్మశాలీల్లో అట్టడుగున బతుకుతున్న కుటుంబాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని నిలదీస్తున్నాం. బి.సి. ల కోసం ప్రవేశ పెట్టిన మొదటి పథకంలోనే తమకు తీవ్ర అన్యాయం చేయటాన్ని ఖండిస్తున్నాం. వెంటనే బి.సి లోన్లలో పద్మశాలిలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం. లేకపోతే రాబోయే రోజుల్లో పద్మశాలి వర్గం ఓట్లతో బుద్ధి చెప్తామని హెచ్చరిస్తున్నాం అని పదశాలి జిల్లా అధ్యక్షులు తెలిపారు. ఇట్టి కార్యక్రమం లో పద్మశాలి కుల బాంధవులు అందరూ జై పద్మశాలి, జై మార్కండేయ అనే నినాదాలతో చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చెట్టిపల్లి సుధాకర్, కోశాధికారి తుమ్మ రాజేశం, జగిత్యాల జిల్లా యువజన సంఘం కన్వీనర్ అయ్యోరు రాజేష్, ధర్మపురి ఆలయ డైరెక్టర్ వేముల నరేష్, పద్మశాలి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భోగ వెంకటేశ్వర్లు, జగిత్యాల పట్టణ అధ్యక్షులు, కొడిమ్యాల మండల అధ్యక్షులు గాజుల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి సిరిపురం మల్లేశం, కొడిమ్యాల పట్టణ అధ్యక్షులు చెన్న దేవేందర్, ప్రధాన కార్యదర్శి కట్టెకోల రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు మంచాల భూమేష్, ట్రస్టు అధ్యక్షులు రాచర్ల శ్రీనివాస్, కార్యదర్శి ఎల్లం పరమేష్, కోశాధికారి కొండ లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు గాజుల సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు అడ్లగట్ట రమేష్, పాసికంటి రాజేంద్రప్రసాద్, జక్కని మురళి, కుల బాంధవులు భోగ గణేష్ మండల పద్మశాలి కుల సభ్యులు పాల్గొన్నారు.

# గాంధీలో వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే వేడుకలు

**అవగాహన ర్యాలీ, బ్లడ్ డోనేషన్ క్యాంప్**

**గాంధీలో దశాబ్ది ఉత్సవాలు**



సికింద్రాబాద్ జూన్ 14 (ప్రజామంటలు): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం హెల్త్ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో గాంధీ ఆసుపత్రిలో పేషంట్లకు ఫ్రూట్స్ ను పంపిణీ చేశారు. గత పదేండ్లలో రాష్ట్రంలోని వైద్యరంగంలో పెనుమార్పులు వచ్చాయని, ప్రభుత్వ దవఖానల్లో ఆధునిక వసతులు, కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటు అయ్యాయని డీఎంఈ డా.కె.రమేశ్ రెడ్డి అన్నారు. ఆరోగ్య తెలంగాణ లో ప్రతి వైద్య సిబ్బంది భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొ.రాజారావు, ఆర్ఎంవోలు డా.జయ కృష్ణ, డా. వెంకట రమణ, జూడా జనరల్ సెక్రటరీ అఖిల్, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే:
వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే సందర్భగా గాంధీ ఆసుపత్రిలో డాక్టర్లు ఆసుపత్రి ఆవరణలో రక్తదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో బ్లడ్ డోనేషన్ క్యాంప్ నిర్వహించారు. వైద్య విద్యార్థులు, యువతీ, యువకులు, సిబ్బంది బ్లడ్ డోనేట్ చేశారు. రక్తదానం చేయడం వలన మరో వ్యక్తి ప్రాణాలు కాపాడవచ్చని డీఎంఈ. రమేశ్ రెడ్డి, సూపరింటెండెంట్ ప్రొ.రాజారావు లు పేర్కొన్నారు. సిటీలో ఐదు చోట్ల బ్లడ్ డోనేషన్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# వృద్దుల ఆరోగ్య సంరక్షణ కోసం సంచార వాహనం

జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ-తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కోసం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 11 జిల్లాలకు మొబైల్ మెడికేర్ యూనిట్ పేరిట వృద్ధుల ఉచిత వైద్య చికిత్స సంచార వాహనం అందించారు. సుమారు రూ.60 లక్షల వ్యయంతో ఎసి సౌకర్యంతో కూడిన 3 చికిత్స అందించే బెడ్ చేర్స్, ఆక్సిజన్ కిట్, రక్త నిధి ఫ్రీజర్ తో కూడిన ఆధునిక వైద్య సౌకర్యాలతో.. ఒక్కో వాహనాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా జగిత్యాల జిల్లాకు కెటాయించిన వాహనాన్ని జిల్లా కేంద్రం నుండి రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కార్యాలయం నుండి బుధవారం సాయంత్రం ప్రారంభం జండా ఊపి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సూచనలతో...జిల్లా సంక్షేమశాఖ అధికారి డా. బోనగిరి నరేష్, రెడ్ క్రాస్ జిల్లా కమిటీ కార్యదర్శి మంచాల కృష్ణ, సభ్యుడు సిరిసిల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి ఈశ్వర్ తో పాటుగా జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్మెన్ గోలి శ్రీనివాస్, రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ కో ఆర్డినేటర్ ఎం.డి రజా, కౌన్సిలర్లు, మున్సిపల్ మాజీ చైర్మెన్ జిఆర్ దేశాయ్, సీనియర్ సిటిజన్స్ హరి అశోక్ కుమార్ మరియు పలువురు జిల్లా అధికారులు, రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 14 జిల్లాలకు రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 14 వాహనాలను అందజేసి ఒక పైలెట్ ప్రాజెక్టుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతినెల జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సీనియర్ సిటిజన్స్ (వృద్ధులకు) ఉచితంగా వైద్య పరీక్షలు, ప్రాథమిక వైద్య చికిత్స అందించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్య పరంగా సీనియర్ సిటిజన్స్ కు, పేద వర్గాల వారికి అందిస్తున్న సహాయ సహకారాలను వివరించారు. కార్యక్రమంను నిర్వహించిన రెడ్ క్రాస్ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

# సాగునీటి రంగంపై, ఇథనాల్ ప్రాజెక్ట్ నెలకొల్పే అంశంలో జీవన్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు అర్ధరహితం



జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు): రాజకీయంలో గెలుపు ఓటములు సహజం. కానీ, ప్రజలను మభ్యపెడుతూ అవాస్తవాలను చెబుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గత నాలుగైదు రోజులుగా సాగునీటి రంగంపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను తప్పుపట్టారు. సమాజంలో రాజకీయాల్లో ఉన్నప్పుడు గెలుపు ఓటములు సహజమని... కానీ అదే పనిగా ప్రజల్ని మభ్య పెట్టే రీతిలో అవాస్తవాలు చెబుతూ, తప్పుడు ప్రకటనలు చేస్తున్న తీరు ఆక్షేపణీయమని అన్నారు. షుగర్ ఫ్యాక్టరీ తెరిపించడంతో పాటుగా, ఇథనాల్ ప్రాజెక్ట్ నెలకొల్పే అంశంలో సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు అర్ధరహితమన్నారు. ఆ ప్రాంత రైతులు చెరుకు పంట వైపు కాకుండా, వరి పంట వైపు మొగ్గు చూపుతున్నారని స్పష్టం చేశారు. అలాగే ఇథనాల్ ప్రాజెక్ట్ అంశంలో జీవన్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు ఎంత మాత్రమూ నిజం లేదని... మూడు కోట్ల లీటర్ల విషపు నీరు ఆ ప్రాంత జలాల్లో కలుస్తుందన్న మాటలు పూర్తి అబద్ధమని అన్నారు. ఒక్క చుక్క కూడా విషపు నీరు ఇథనాల్ ప్రాజెక్టుకు సంబంధించి ఆ ప్రాంత జలాల్లో కలవడం లేదని నిపుణులే స్పష్టం చేస్తున్నారని అన్నారు. ఈ విషయంలో నిపుణులు చెప్పింది అబద్ధమైతే తాను ఇదే జగిత్యాల పాత బస్టాండ్ చౌరస్తాలో ముక్కు భూమిపై రాయడంకు సిద్ధమనీ అందుకు జీవన్ రెడ్డి కూడా సిద్ధమేనా అని మంత్రి కొప్పుల ఈశ్వర్ సవాల్ విసిరారు.

## తడి చెత్త ద్వార సేంద్రియ ఎరువు తయారు



ఎల్కతుర్తి జూన్ 14 (ప్రజామంటలు): ఎల్కతుర్తి మండలంలో కిలో బ్యాగులను ఆవిష్కరించిన సర్పంచ్ చదిరం వసంత నాగేశ్వర్. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ట్రాక్టర్ ద్వారా గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త సేకరించి డంపింగ్ యార్డు షెడ్ లో వేసి తడి, పొడి చెత్త ను వేరు చేసి తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నామని వీరానారాయణపూర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ చదిరం వసంత నాగేశ్వర్ పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాలుగా సేంద్రియ ఎరువు తయారు చేస్తు నర్సరీ లో మొక్కల ఎదుగుదలకు వాడుతున్నామని పల్లె ప్రకృతి వనంలో నాటిన చెట్లకు ఎరువు వేస్తున్నామని ఇప్పుడు గ్రామ రైతుల కోసం కిలో బ్యాగులు అందుబాటులో ఉంటాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పుల్లూరి వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి ఆర్. సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు



మహాదేవపూర్ జూన్ 14 (ప్రజామంటలు): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని ఎనకపల్లి గ్రామంలో కార్డాన్ సెర్చ్ నిర్వహించడం జరిగింది గ్రామంలో సోదాలు చేసి ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగింది. అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి ఎస్సై రాజకుమార్ మాట్లాడుతూ.... అభివృద్ధి నిరోధకులైన మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించడం జరిగింది అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించడం జరిగింది అలాగే గ్రామంలో గుట్కా సారా గంజాయి వంటివి విక్రయించవద్దని ఒకవేళ ఎవరైనా నిబంధనలు అతిక్రమించి విక్రయాలు చేపట్టితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ ఎస్సై రాజ్ కుమార్, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంఆర్వో నూతన భవనానికి భూమి పూజ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు



కోరుట్ల టౌన్ జూన్ 14 (ప్రజామంటలు): ప్రజలకు దూరాభారం తగ్గేందుకు ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేల కల్లూరు రోడ్ లో తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్మించడం జరుగుతుందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను దృష్టిలో ఉంచి తహసీల్దార్ కార్యాలయాన్ని కల్లూరు రోడ్ కు తరలిస్తున్నట్లు తెలిపారు. తహశీల్ధార్ కార్యాలయం తో పాటు ఎమ్మెల్యే ఆఫీస్ మున్సిపల్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, వ్యవసాయ అఫిస్ ఒకె చోట ఉండి ప్రజలకు వేగవంతమైన సేవలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షడు చీటీ వెంకట్రావు, బీఆర్ఎస్ మండల పట్టణ అధ్యక్షుడు దరిశెట్టి రాజేష్, అన్నం అనిల్, నాయకులు సాయిని రవీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



కోరుట్ల టౌన్ జూన్ 14 (ప్రజామంటలు): కోరుట్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్య, ఉపాధ్యాయ పరమైన సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సకాలంలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ అందజేయాలని, నెల మొదటి తారీకు వరకు పాఠశాల మధ్యాహ్న భోజనం బియ్యం చేయాలని, మన ఊరు మనబడి పథకానికి ఎంపికైన పాఠశాలల్లో మిగులుగా ఉన్న ఫర్నిచర్ ను ఎంపిక కాని అవసరమైన పాఠశాలలకు అందజేయాలని, 2022 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్ష విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవును మంజూరు చేయాలని, గత సంవత్సరం దసరా సెలవులలో ఆన్లైన్ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సిసిఎస్ మంజూరు చేయాలని మండల విద్యాధికారి గంగుల నరేశం కు టీఎస్ యుటిఎఫ్ కోరుట్ల మండల శాఖ ఆధ్వర్యంలో ప్రాతినిధ్యం చేయడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు సిరిపురం శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు శ్యామకూర శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మాసం చిరంజీవి, కార్యదర్శులు కొంద్ర అనీల్ కుమార్, ఒజ్జ శ్రీనివాస్, గుండెల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూట్రిషన్, కేసీఆర్ కిట్ల పంపిణీ ఉత్తమ సిబ్బందికి సర్టిఫికెట్లు, మెమోంటోలు



సికింద్రాబాద్ జూన్ 14 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర వైద్య శాఖ ఆధ్వర్యంలో దశాబ్ధి ఉత్సవాలల్లో భాగంగా బుధవారం సికింద్రాబాద్ సీతాఫల్ మండీ లోని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో వైద్య సిబ్బంది వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలకు కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు, ఎన్సీడీ కిట్లు, కంటి వెలుగు కళ్ళద్దాలను పంపిణీ చేశారు. అలాగే ఆశా, ఏఎన్ఎం కార్యకర్తలకు చీరలు, చక్కటి పనితీరు కనబర్చిన సిబ్బందికి మెరిట్ సర్టిఫికెట్లు, మెమోంటోలను సీతాఫల్ మండి ఎస్.పీ.హెచ్.వో, డాక్టర్ జీ. సక్కుబాయి అందచేశారు. గత పదేండ్లలో రాష్ట్రంలోని వైద్య రంగంలో సీఎం కేసీఆర్, హెల్త్ మినిస్టర్ హరీష్ రావు ఆధ్వర్యంలో పెనుమార్పులు వచ్చాయని, సర్కార్ దవఖానల్లో ఆధునిక సౌకర్యాలు, కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటు అయ్యాయని డాక్టర్ సక్కుబాయి అన్నారు. ఈసందర్భంగా టీబీ వ్యాధి నివారణ, ఆదునిక చికిత్స విధానాలపై బీటీబీ ప్రాజెక్ట్ కమ్యూనిటీ కో ఆర్డినేటర్ తులసీ వివరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ నర్పత్ సింగ్, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం పెద్ద పీట

### ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



హుస్నాబాద్ జూన్ 14 (ప్రజామంటలు): తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో కెసిఆర్ కిట్, పండ్ల పంపిణీ మరియు టీచర్ ట్రైనింగ్ సెంటర్ భవనంలో గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్. ఎమ్మెల్యే మాట్లాడుతూ... మాతా శిశు సంరక్షణకు పెద్ద పీట వేస్తున్న తెలంగాణ ప్రభుత్వం మరో విప్లవాత్మకమైన పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో ఇప్పటికే ప్రారంభించిన కేసీఆర్ కిట్ సూపర్ హిట్ కాగా, ఇదే స్ఫూర్తితో కేసీఆర్ న్యూట్రీషన్ కిట్లకు రూపకల్పన చేసింది. మాతా శిశు సంరక్షణలో న్యూట్రీషన్ కిట్లు,కేసీఆర్ కిట్ల పథకాన్ని దేశంలో ఎక్కడా లేనట్లుగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్నది. ఈ న్యూట్రీషన్ కిట్ లో ప్రోటీన్స్, మినరల్స్, విటమిన్స్ లను పోషకాహారం ద్వారా అందించి రక్త హీనత తగ్గించడం, హీమోగ్లోబిన్ శాతం పెంచడం న్యూట్రీషన్ కిట్ల లక్ష్యం. ఇందులో భాగంగా ఒక్కో కిట్‌కు రూ. 2 వేల రూపాయలతో రూపొందించి, కిట్లను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నది. 13-27 వారాల మధ్య జరిగే రెండో ఏఎన్‌సీ చెకప్ సమయంలో ఒకసారి, 28-34 వారాల మధ్య చేసే మూడో ఏఎన్‌సీ చెకప్ సమయంలో రెండో సారి ఈ కిట్లను ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు. హుస్నాబాద్ లో మాతా శిశు సంరక్షణ కేంద్రం పాటు హుస్నాబాద్ ప్రాథమిక ఆసుపత్రి 30 పడకల నుండి 50 పడకల సామర్థ్యం గల కమ్యూనిటీ ఆసుపత్రిగా మార్చడం జరిగిందన్నారు. మీర్జాపూర్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో నెలకొల్పడం జరిగింది అని అన్నారు.బస్తీ దవాఖానేను, అవే కాకుండా అదనంగా మరో 35 పల్లె దవాఖానాలు, ఒక డయాలసిస్ సెంటర్, మోకీలు ఆపరేషన్ కేంద్రం, ప్రభుత్వ ఆసుపత్రిలో అంతకు ముందు 54 టెస్టులు చేసే సౌకర్యం మాత్రమే ఉండగా ఇప్పుడు 134 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. హుస్నాబాద్ ప్రాంత ప్రజలు వైద్యం కోసం జిల్లా కేంద్రాలకు, హైదరాబాదుకు పోకుండా ఇక్కడే అన్ని రకాలుగా వైద్య సౌకర్యాలు కల్పించామని రానున్న రోజులలో ఇంకా మెరుగైన వైద్య సేవలు హుస్నాబాద్ ప్రజలకు అందిస్తామని హామీ ఇచ్చారు.అలాగే ఏఎన్ఎం లకు పిపి కిట్లు, పేషెంట్లకు అన్ని రకాల మందులు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉంటున్నాయని, మగ శిశువు పుడితే 12 వేలు, ఆడ శిశువు పుడితే 13 వేల రూపాయలు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని అన్నారు. ఆరోగ్య మహిళా కేంద్రాలు, అమ్మ ఒడి ఇలాంటి పథకాలకు శ్రీకారం చుట్టి మహిళల ఆరోగ్యం కోసం పెద్ద పీట వేస్తున్నది తెలంగాణ ప్రభుత్వం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎం.పి.పి. లకావత్ మానస అక్కనపెట్ ఎంపిపి గుగూలోతు లక్ష్మి, అక్కన్నపెట్ జెడ్పిటిసి భుక్యా మంగా, హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్మన్ అయిలేని అనిత తదితరులు పాల్గొన్నారు.

## దట్నూర్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం



గొల్లపెల్లి జూన్ 14 (ప్రజామంటలు): ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎంపీ యుపిఎస్ దట్నూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జూపాక సుదర్శన్ ఆధ్వర్యంలో ఒకటవ తరగతిలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఉచితంగా పలకలు ఇచ్చి అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది, బడిబాటలో భాగంగా మొత్తం 12 మంది విద్యార్థులు నమోదు అయినారు. ఇందులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు మనబడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలకు అన్ని సకల సౌకర్యాలను కల్పించింది. కావున విద్యార్థుల తల్లిదండ్రులు మన ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని మనబడిని మనం కాపాడుకుందాం మన అందరి బాధ్యత అని ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకుల పావని నగేష్ గౌడ్, పాఠశాల విద్య కమిటీ చైర్మన్ బిసగోని గంగజల, ఉప సర్పంచ్ మీసాల పోచమ్మ వినోద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్, సి.ఆర్.పి. ప్రభాకర్, ఉపాధ్యాయులు రాచకొండ హరికృష్ణ, జెట్టి లక్ష్మి నరసయ్య, ప్రతాప నాగరాజు, చింతం మాధవి పాల్గొన్నారు.



బి.సి. లకు లక్ష రూపాయల పతకం జాబితా లో పద్మశాలి లను చేర్చాలని కలెక్టర్ కు వినతిపత్రాన్ని సమర్పించిన జగిత్యాల జిల్లా, పట్టణ పద్మశాలి సేవ సంఘ అధ్యక్షులు , నాయకులు, సభ్యులు.



జనగామ పట్టణంలో పలు ప్రైవేట్ పాఠశాలల్లో జి.ఒ. నెంబర్ 1 కి విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఎస్.ఎఫ్.ఐ, ఎ.ఐ.ఎస్.ఎఫ్, డి.వై.ఎఫ్.వై. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డి.ఇ.ఒ.కి మెమొరాండం అందజేతలో పాల్గొన్న ధర్మభిక్షం, నాగరాజు, సందీప్.

## ఉత్సవాల భాగంగా వైద్య ఆరోగ్య శాఖ



ఇబ్రహీంపట్నం జూన్ 14 (ప్రజామంటలు): తెలంగాణ అవతరణ దశాబ్ది వైద్య ఆరోగ్య శాఖ, ఉత్సవాల సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ ఉత్తమ ఫార్మసిస్ట్ అవార్డును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపునుండి కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఎమ్మెల్యే చేతుల మీదుగా జిఎస్ గార్డెన్ కోరుట్ల నుండి అందుకోవడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్ మేడం పాల్గొన్నారు. తను అందించిన ఉత్తమ సేవలకు ఫలితంగా మన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు చిలువేరి ఉదయ్ ప్రసాద్ కు రావడం ఎంతో గర్వించదగ్గ విషయం మరియు ఆనందదాయకం మరియు అభినందనీయం అని డాక్టర్ బి. శ్రీజ వైద్యాధికారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇబ్రహీంపట్నం వారికి అభినందనలు తెలుపుతూ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది వారికి అభినందనలు తెలియజేశారు.

## జేసీబీలతో గుడిసెలు తొలగించడం అమానుషం, అక్రమం




జనగామ జూన్ 14 (ప్రజామంటలు): మహబూబాబాద్ పట్టణంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను జెసిబితో తొలగించడం అమానుషం, అక్రమం అని సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి విమర్శించారు. బుధవారం జనగామ పట్టణంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య బాధ్యుల సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, బిట్ల గణేష్, దూసరి నాగరాజు, దడిగే సందీప్, పాము శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన

### పాల్గొన్న ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు



కోరుట్ల జూన్ 14 (ప్రజామంటలు): మండలం లోని పైడిమడుగు శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఈరోజు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ వేడుకలు సోమవారం ప్రారంభం కాగా మూడవరోజు శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గీత కార్మికుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బీర్పూర్ మండలం తాళ్ల ధర్మారం గ్రామానికి చెందిన నిరుపేద వధువు తత్ర మమత వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించి, మమత కు తండ్రి లేదని తెలిసి 10 వేల ఆర్థిక సహాయం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్.

## అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధత కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్

### సమీక్షించిన ఎన్నికల ప్రధాన అధికారి

జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు): రాష్ట్రంలో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధత కార్యక్రమాలను పూర్తిచేసే అంశంపై జిల్లా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుండి ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, డిజిపి అంజని కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ లతో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ సన్నద్ధత సమా వేశంపై వీడియో సమావేశం ద్వారా సమీక్షించగా, జగిత్యాల సమీకృత జల్లా కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో కలెక్టర్, ఎస్పీ, తదితరులు హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధం కావాలని ఆయన సూచించారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్, అదనపు కలెక్టర్ లత, ఆర్డీఓ లు మాధురి, వినోద్ కుమార్, సిఐ రాజ్ కుమార్, తహశీల్దార్ రాజేందర్, ఎన్నికల డి.టి. ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092,PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com